# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 9550504718, 9030757571

# దెబోరా స్వరం

సంపుటి : 16 సంచిక : 4 జూలై - ఆగష్టు 2023 విడి ప్రతి వెల రూ. 5/- సం॥ర చందా రూ॥ 100/-


హృదయ పరీక్ష శీర్షిక నుండి

## 25. స్వనీతి

- జాయ్ చెరియన్

*సంపాదకురాలి కలమునుండి...*

దెబోరాస్వరం పాఠకులకందరికీ క్రీస్తునామమున శుభములు.

తామే నీతిమంతులమని అతిశయిస్తూ ఇతరులను తృణీకరించేవారిని 'స్వనీతిపరులు' అంటారు. విశ్వాసులలో ఇట్టి స్వనీతి ఉండకూడదు. మన నీతి దేవుని ముందు మురికిగుడ్డవలె ఉంది.

**"మేమందరము అపవిత్రులవంటివారమైతిమి మా నీతి క్రియలన్నియు మురికిగుడ్డవలె నాయెను."** - యెషయా 64:6

పాపులము, అయోగ్యులము, సిలువకు శత్రువులుగా ఉంటూ దేవునికి దూరస్థులుగా ఉన్న మనము దేవుని ఉచితమైన కృపద్వారా, యేసుక్రీస్తు సిలువ బలియాగముద్వారా రక్షింపబడ్డాము. క్రీస్తుయేసు రక్తముద్వారా నీతిమంతులుగా తీర్చబడ్డాము. ఆయన నీతిమత్వము మనకు ధరింపచేసి నందున క్రీస్తే మన నీతియైయున్నాడు. కాబట్టి ఎవరుకూడ మేమే పరిశుద్ధులము నీతిమంతులమని స్వనీతితో అతిశయించకుండ క్రీస్తునందు అతిశయించాలి.

**"- అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను అని వ్రాయబడియున్నది నెరవేరునట్లు దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను."**

- 1 కొరింథీ. 1:31

యేసుక్రీస్తే మన నీతి, పరిశుద్ధత, జ్ఞానము, విమోచనయై యున్నాడు. ఈ రోజు నీవేమైయున్నావో అది నీ నీతి, భక్తి కాదు గాని కేవలము దేవుని యొక్క ఉచితమైన కృప అని అపొ.పౌలు వ్రాస్తున్నాడు. అందుకే ఎప్పుడూ ఇతరులకంటె నేనే ప్రార్థనాపరుడను, నాకే వాక్యజ్ఞానముంది, నా అంత పరిశుద్ధులు లేరు, నేనే నీతిమంతుడనని నిన్ను నీవు గొప్పగా యెంచుకుంటూ ఇతరులందరు నీకంటే తక్కువవారు, అనీతిమంతులు, అయోగ్యులని వారిని తృణీకరించవద్దు. ఇట్టి స్వనీతిపరులను దేవుడు అసహ్యించుకుంటాడని వాక్యములో ఉంది.

**"వారు - మా దాపునకురావద్దు ఎడముగా ఉండుము నీకంటె మేము పరిశుద్ధులమని చెప్పుదురు; వీరు నా నాసికారంధ్రములకు పొగవలెను దినమంతయు మండుచుండు అగ్నివలెను ఉన్నారు."** - యెషయా 65:5

మేమే పరిశుద్ధులము నీతిమంతులమని ఇతరులను మా దాపునకు రావద్దని వేరుగా ఉండమంటు దూరముగా ఉండేవారు దేవుని ఉగ్రత పాలవుతారు. అట్టివారు దినమంతయు మండుచున్న అగ్నివలెను దేవుని నాసికారంధ్రములకు పొగవలెను ఉన్నారంటున్నాడు.

ఆ దినములలో శాస్త్రులు, పరిసయ్యులు, రబ్బీనీలు తామే నీతిమంతులమని స్వనీతితో అతిశయిస్తూ ఇతరులను పాపులుగా చూస్తూ ద్వేషించేవారు.

యేసు ప్రభువు - **"తామే నీతిమంతులని తమ్ము నమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో ఆయన ఈ ఉపమానము చెప్పెను."**

- లూకా 18:9

సుంకరి, పరిసయ్యుడు ఇద్దరు దేవాలయమునకు వెళతారు. అక్కడ పరిసయ్యుడు తనను మించిన నీతిమంతుడు లేడని, తానే ఉపవాస ప్రార్థన చేస్తానని, దేవునికి దశమభాగము ఇస్తానని, పేదలకు బీదలకు సహాయం చేస్తానని, నేను పాపులు, చోరులు మరియు ఈ సుంకరివలె లేనందుకు నీకు వందనాలు చెల్లిస్తున్నానని ప్రార్థనలో తన గొప్పతనము చాటుకుంటున్నాడు. సుంకరి ఆకాశము తట్టు కన్నులెత్తుటకైనను ధైర్యము చాలక రొమ్ము కొట్టుకుంటూ పాపినైన నన్ను కరుణించుమని ప్రార్థించాడు. ఈ ఇద్దరిలో దేవుడు పరిసయ్యుని ప్రార్థనను అంగీకరించలేదు, సుంకరి ప్రార్థనను అంగీకరించాడు. సుంకరిని నీతిమంతుడిగా చేశాడు.

**"అతనికంటె ఇతడు నీతిమంతుడిగా తీర్చబడి తన యింటికి వెళ్లెనని మీతో చెప్పుచున్నాను."** - లూకా 18:14

యేసు ప్రభువు శరీరధారిగా ఉన్నప్పుడు పాపులతో సహవాసము చేశాడు, వారితో కలిసి భోజనము చేశాడు. అప్పుడు స్వనీతిపరులైన కొందరు పరిసయ్యులు, శాస్త్రులు ఇతడు పరిశుద్ధుడైతే పాపులతో ఎందుకు భోజనము చేస్తున్నాడని సణుగుతున్నారు.

**"ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధ వినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా పరిసయ్యులును శాస్త్రులును అది చూచి - ఇతడు పాపులను చేర్చుకొని వారితోకూడ భోజనము చేయుచున్నాడని చాల సణుగుకొనిరి."** - లూకా 15:1-2

అప్పుడు వారితో ఉపమానరీతిగా ఈ విధముగా బోధించాడు. ఒకనికి వంద గొఱ్ఱెలుండి అందులోనుండి ఒక్కటి తప్పిపోతే ఆ కాపరి తొంబదితొమ్మిది గొఱ్ఱెలను విడిచి తప్పిపోయిన గొఱ్ఱెను వెదకి తీసికొని వచ్చి మందలో తిరిగి చేర్చుతాడు. ఒక స్త్రీకి పది వెండి నాణెములు కలిగియుండి అందులో ఒకటి పోతే ఆమె ఇల్లాంతా ఊడ్చి ఆ నాణెము దొరికేంతవరకు వెదకుతుంది. నాణెము దొరికినప్పుడు ఎంతో సంతోషిస్తుంది. అదే విధముగా తప్పిపోయిన కుమారుడు ఇంటికి రాగానే తండ్రి ఎంతో సంతోషించి అతనికి ప్రశస్త వస్త్రములు తొడిగి, చేతికి బంగారు ఉంగరము పెట్టి గొప్ప విందు చేస్తాడు. అలాగున ఒక పాపి మారుమనస్సు పొందినప్పుడు పరలోకంలో గొప్ప సంతోషము కలుగుతుంది. పాపులను రక్షించుటకు యేసుక్రీస్తు లోకమునకు వచ్చాడని వారికి తెలియజేశాడు.

**"పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను."** – 1 తిమోతి 1:15 అని అపో.పౌలు అంటున్నాడు.

అందుకే స్వనీతిని విడిచి దేవునియందు అతిశయిస్తు ఆయనే మన నీతిగా కలిగి యుండాలి. దేవుని వెదకాలి. దీనమనస్సు కలిగి సాత్వికుడవై దేవునియందు నిరీక్షణ కలిగి యుండాలి. అట్టివారు దేవుని దయ పొందుతారు. ఆయన మహోన్నతుడైనను దీనుల మధ్య నివసిస్తాడు. సాత్వికులు భూలోకమును స్వతంత్రించుకుంటారు. కాబట్టి నేనే ఇతరులకంటే పరిశుద్ధుడను, నీతిమంతుడనని నిన్ను నీవు హెచ్చించుకోవద్దు.

**"వివేకము కలిగి దేవుని వెదకువారు కలరేమో అని దేవుడు ఆకాశమునుండి చూచి నరులను పరిశీలించెను. వారందరును దారి తొలగి బొత్తిగా చెడియున్నారు. ఒకడును తప్పకుండ అందరును చెడియున్నారు మేలు చేయువారెవరును లేరు ఒక్కడైనను లేడు."** – కీర్తనలు 53:2,3

నీతిమంతులు ఎవరైనా ఉన్నారా? అని దేవుడు ఆకాశమునుండి చూచినప్పుడు ఎవరూ కనిపించలేదు. అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించే మహిమను పొందలేకపోతున్నారు. పాపమువలన వచ్చు జీతము మరణము గనుక యేసుప్రభువు ఆ పాపశిక్షను సిలువలో తాను భరించి ఆయన సిలువలో కార్చిన రక్తముద్వారా సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రపరచి నీతిమంతులుగా చేశాడు.

యేసుప్రభువు శరీరధారిగా ఉన్నప్పుడు పాపములో పట్టబడిన స్త్రీని రాళ్లురువ్వి చంపడానికి యేసుప్రభువు దగ్గరకు ఈడ్చుకొని వస్తారు. ధర్మశాస్త్ర చట్ట ప్రకారము పాపములో పట్టబడినవారిని రాళ్లురువ్వి చంపాలి. అయితే యేసుప్రభువు – గుమికూడిన జనసమూహముతో మీలో పాపము చేయనివాడు మొదట రాయి వేయమంటాడు. అక్కడ ఉన్నవారందరును పాపము చేసినవారే గనుక ఎవరూ రాళ్లు రువ్వకుండా మౌనముగా వెళ్లిపోయారు. అప్పుడు పాపములో పట్టుబడిన ఆ స్త్రీతో – నీవు వెళ్లి ఇక పాపము చేయకుము అని అంటాడు.

ప్రభువు ఒక పరిసయ్యుని గృహములో విందుకు ఆహ్వానింపబడతాడు. అక్కడకు ఒక పాపాత్మురాలైన స్త్రీ వచ్చి ఆయన పాదములమీద పడి ఏడుస్తు కన్నీటితో ఆయన పాదములు కడిగి తలవెంద్రుకలతో తుడిచి మానక ప్రభువు పాదములు ముద్దు పెట్టుకుంటుంది.

**"ఆయనను పిలిచిన పరిసయ్యుడు అది చూచి – ఈయన ప్రవక్తయైన యెడల తన్ను ముట్టుకొనిన యీ స్త్రీ ఎవతెయో ఎటువంటిదో యెరిగియుండును; ఇది పాపాత్మురాలు అని తనలో తాననుకొనెను."**

– లూకా 7:39

స్వనీతిపరుడైన ఆ పరిసయ్యుడు తన మనస్సులో ఏమనుకుంటున్నాడో ప్రభువు గ్రహించి అతనితో –

**"ఈ స్త్రీని చూచుచున్నావే, నేను నీ యింటిలోనికి రాగా నీవు నా పాదములకు నీళ్లియ్యలేదు గాని, యీమె తన కన్నీళ్లతో నా పాదములను తడిపి తలవెండ్రుకలతో తుడిచెను. నీవు నన్ను ముద్దుపెట్టుకొనలేదు గాని, నేను లోపలికి వచ్చినప్పటినుండి యీమె నా పాదములు ముద్దు పెట్టుకొనుట మానలేదు. నీవు నూనెతో నా తల అంటలేదు. గాని ఈమె నా పాదములకు అత్తరు పూసెను. ఆమె విస్తారముగా ప్రేమించెను గనుక ఆమెయొక్క విస్తార పాపములు క్షమించబడెనని నీతో చెప్పుచున్నాను."** – లూకా 7:44-47 అనెను. ఆ స్త్రీతో నీ పాపములు క్షమింపబడియున్నవి; సమాధానముగలదానవై పొమ్మనెను. పాపములు క్షమించుటకు మనుష్య కుమారునికి అధికారమియ్యబడి యున్నది.

పాపములో ఉన్నవారిని చూచినప్పుడు కనికరపడి వారిని రక్షించాలి గాని స్వనీతిపరులమని గర్విస్తూ వారిని తృణీకరిస్తున్న శాస్త్రులను పరిసయ్యులను యేసుప్రభువు గద్దించాడు.

**"అయ్యో వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు గిన్నెయు పళ్లెమును వెలుపట శుద్ధిచేయుదురు గాని అవి లోపల దోపుతోను అజితేంద్రియత్వముతోను నిండియున్నవి. గ్రుడ్డిపరిసయ్యుడా! గిన్నెయు పళ్లెమును వెలుపల శుద్ధియగునట్టుగా ముందు వాటిలోపల శుద్ధిచేయుము."**

– మత్తయి 23:25-26

స్వనీతిపరులైన పరిసయ్యులతో మీరు పైకి భక్తిగలవారిగా ఉండి హృదయమంతా పాపముతో నిండియున్నారు. ముందు మీ హృదయ అంతరంగ స్వభావమును శుద్ధిచేసికొనమని ప్రభువు గద్దిస్తున్నాడు. గిన్నెయు పళ్లెమును బయట కడుగుతున్నారు గాని అవి లోపల దోపుతోను అజితేంద్రియత్వముతోను నిండియున్నవని అంటూ వారిని గ్రుడ్డి పరిసయ్యులారా, అంధులైన మార్గదర్శకులారా అని సంబోధిస్తున్నాడు.

సేవ ఆరంభ దినములలో దేవుడు నాకు అనేక విషయములు నేర్పించాడు. పరిశుద్ధాత్మ దేవుడు నా వంటగదినే బైబిల్ కాలేజిగా చేసి అనేక విషయములు బోధించాడు. మా ఇంట్లో ఒక ముస్లిమ్ సహోదరి చాలా సంవత్సరాలు ఇంటిపని చేసేది. నీళ్లు పట్టుకొనే బిందెలు తోమినప్పుడు అవి తళతళమని మెరిసిపోతూ మన ముఖము అందులో కనబడేది. అది చూసి నేను ఎంత బాగా పనిచేస్తుందని సంతోషపడేదానను. ఒకరోజు గ్లాసు బిందెలో పడితే తీయడానికి బిందెలో చేయిపెడితే జారిపోతుంది. లోపలంతా మురికి నాచు ఉన్నట్టుగా జారుతుంది. అంటే ఆ సహోదరి పైన మాత్రమే శుభ్రము చేసేది గాని లోపల శుభ్రము చేయలేదని అర్థమైపోయింది. అప్పుడు ప్రభువు నాతో మాట్లాడాడు. నీవు బయట ప్రపంచమునకు పరిశుద్ధముగా, నీతిమంతుడిగా కనబడితే సరిపోదు గాని హృదయాంతరంగముకూడ యేసురక్తంద్వారా కడుగబడి పరిశుద్ధుడిగా పవిత్రుడిగా ఉండాలని నేర్పించాడు.

**"మనుష్యులకు కనబడవలెనని వారియెదుట మీ నీతికార్యము చేయకుండ జాగ్రత్తపడుడి; లేనియెడల పరలోకమందున్న మీ తండ్రియొద్ద మీరు ఫలము పొందరు."** - మత్తయి 6:1

మనుష్యులకు కనబడాలని మీరు నీతికార్యములు చేస్తే దాని ఫలము పొందలేరని ప్రభువు చెపుతున్నాడు. నీవు చేసే ప్రార్థనైనా, ఉపవాసమైనా, దానధర్మములైనా రహస్యముగా చేయాలి. అప్పుడు రహస్యమందు చూచుచున్న నీ తండ్రి నీకు ప్రతిఫలమిస్తాడు. నీవు ధర్మము చేసినప్పుడు ఇంత చేశానని బూర ఊదవద్దు. నీ కుడిచేతితో చేసింది ఎడమచేతికికూడ తెలియకూడదంటున్నాడు.

**"అయ్యో వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు సున్నముకొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి. ఆలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా నగపడుచున్నారు గాని, లోపల వేషధారణతోను అక్రమముతోను నిండి యున్నారు."** - మత్తయి 23:27,28

**"అయ్యో వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు పుదీనాలోను సోపులోను జీలకఱ్ఱలోను పదియవ వంతు చెల్లించి, ధర్మశాస్త్రములో ప్రధానమైన విషయములను, అనగా న్యాయమును కనికరమును విశ్వాసమును విడిచిపెట్టితిరి; వాటిని మానక వీటిని చేయవలసి యుండెను. అంధులైన మార్గదర్శకులారా, దోమ లేకుండునట్లు వడియగట్టి ఒంటెను మ్రింగువారు మీరే."** - మత్తయి 23:23,24

భక్తులమని, ధర్మశాస్త్రమును అనుసరిస్తున్నామని స్వనీతి చాటు కొంటున్న వేషధారులైన శాస్త్రులు పరిసయ్యులతో మీరు వాటికంటే ముఖ్యమైన న్యాయమును, కనికరమును విడిచిపెట్టారని గద్దిస్తున్నాడు. దోమను వడగట్టి ఒంటెను మ్రింగు అంధులైన మార్గదర్శకులని కోపగిస్తున్నాడు. పాపులను, అతిక్రమములో ఉండేవారిని చూచినప్పుడు నీ హృదయము కనికరముతో నింపబడాలి. పేదలు, బీదలను చూచినప్పుడు వారికి సహాయపడాలి. కనికరముతో పాపులను పరిశుద్ధ మార్గంలోనికి నడిపించాలి. అందుకే దావీదు భక్తుడు ఈలాగున ప్రార్థన చేస్తున్నాడు.

**"నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము నీ పరిశుద్ధాత్మను నాయొద్దనుండి తీసివేయకుము. నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము. అప్పుడు అతిక్రమము చేయువారికి నీ త్రోవలను బోధించెదను పాపులును నీ తట్టు తిరుగుదురు."** - కీర్తనలు 51:11-13

గొప్ప భక్తునివి, భక్తురాలవని చాటించడానికి, అందరికన్న ఎక్కువ కృపావరములతో నింపబడ్డాను, భాషలతో మాట్లాడుతున్నాను అంటూ ప్రదర్శించుకోవడానికి కాదు పరిశుద్ధాత్మశక్తి. పాపులను దేవునితట్టు ఆకర్షించడానికి, రక్షణ మార్గములోకి నడిపించడానికే పరిశుద్ధాత్మతో నింపబడ్డావని గ్రహించాలి. దేవునికి చెందవలసిన మహిమను దేవుడు ఇతరులతో పంచుకోడు. ఆయన బహు రోషముగల దేవుడు. దేవుని సేవకులు నేనేదో భక్తిపరుడను, నేను గొప్ప కార్యములు చేశాను అంటూ స్వనీతితో అతిశయించకూడదు. దేవుడు మంటి ఘటములలో తన మహిమైశ్వర్యమును నింపి తనసేవకులను వాడుకుంటాడు. కాబట్టి మహిమ, ఘనత ఆయనకు చెందినవి. ఏ నరుడు అతిశయించుటకు వీలులేదు. మనమేమైయున్నామో అది దేవుని కృపయై యున్నదని దేవుని నామమును మహిమపరచాలి.

కొన్ని కుటుంబములలో స్త్రీలు భక్తిపరులుగా ఉంటారు. పురుషులకు అంత భక్తి ఉండదు. అట్టి స్త్రీలు మేమే భక్తిగలవారము అని గర్వించకూడదు. నిన్ను ఇంత భక్తిపరులుగా దేవుడు ఎందుకు చేశాడంటే నీద్వారా నీ భర్త, నీ పిల్లలు రక్షింపబడాలనే జ్ఞానము కలిగి యుండాలి గాని వారిని భక్తిహీనులని తృణీకరించకూడదు. నీ కన్నులు తెరువబడ్డాయి. వారి మనోనేత్రములుకూడ వెలిగింపబడాలని కనికరముతో వారికొరకు ప్రార్థించాలి.

స్వనీతిపరులను దేవుడు అసహ్యించు కుంటాడు గనుక మనలో స్వనీతి ఉంటే తొలగించుకోవాలి.



**ప్రార్థన:** ప్రభువా, నీవే మా నీతియని నేర్చు కొన్నాము. కాబట్టి మాలోనుండి స్వనీతిని తొలగించి నీ రక్తముద్వారా పరిశుద్ధపరచి నీతిమంతులుగా చేయండి. పరిశుద్ధాత్మచేత అభిషేకింపబడి పాపులను పరిశుద్ధమార్గములో నడిపించడానికి నీ కృపా సహాయము దయ చేయుమని యేసు నామములో అడుగుతున్నాము తండ్రీ. ఆమేన్!

## UPF Bank Account Details

### Union Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **133911100000946** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **UBIN0813397** |

### State Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **67088374386** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **SBIN0012917** |

**చెక్కులు : United Peoples Fellowship**
**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ పేరుతో**
**(చెక్కు వెనుక మీ పేరు మరియు ఫోన్ నెంబర్ తప్పక వ్రాయగలరు)**
**Phone Pe / G Pay : 7901236907**
**POS : Card Swipe**

# దేవుని సహస్రనామములు

## 363. దిగినవాడు - ఎఫెసీ. 4:10

**"ఆరోహణమాయెననగా ఆయన భూమియొక్క క్రిందిభాగములకు దిగెననియు అర్థమిచ్చుచున్నదిగదా. దిగినవాడు తానే సమస్తమును నింపునట్లు ఆకాశమండలము లన్నిటికంటె మరి పైకి ఆరోహణమైనవాడునై యున్నాడు."** - ఎఫెసీ. 4:9,10

దేవుని అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తు సర్వమానవాళిని రక్షించడానికి, సర్వలోక పాపపరిహారార్థమై పరలోకమునుండి భూలోకమునకు దిగివచ్చాడు. తండ్రి కుడిపార్శ్వమందు కూర్చునే ఆ గొప్ప భాగ్యమును విడిచిపెట్టి నీ కొరకు నాకొరకు పరమునుండి దిగివచ్చాడు. దిగివచ్చినవాడు అనే నామము ధ్యానిస్తున్నాము. పాపివి, శాపగ్రస్తుడవు, అవిధేయుడవైన నీవు దేవుని ఆజ్ఞలు మీరి పాపములో కొట్టుమిట్టాడుతు నాశనకరమైన గుంటలో జిగటగల దొంగ ఊబిలో కూరుకుపోతు నరకపాత్రుడవైన నిన్ను రక్షించడానికి ఆయన ఆ ఉన్నతస్థలమునుండి దిగివచ్చాడు. తన్ను తాను తగ్గించుకున్నాడు. రిక్తునిగా చేసికున్నాడు. దాసుని రూపము దాల్చాడు. సిలువ మరణము పొందునంతగా తండ్రి చిత్తమునకు విధేయుడయ్యాడు.

అందరికి తామున్న స్థానములోనుండి పైపైకి ఎదగాలనే ఆశ ఉంటుంది. కాని తామున్న స్థానములోనుండి క్రింది స్థానమునకు దిగడము ఎవరికీ ఇష్టముండదు. ఇది మనిషి సహజమైన స్వభావము. కాని యేసుప్రభువు తన సింహాసనమునుండి, ఉన్నతమైన స్థలమునుండి, పరలోకమునుండి దిగాడు. దివినుండి భువికి నీకొరకే దిగివచ్చాడు. నిన్ను రక్షించడానికి, నిన్ను స్వస్థపరచడానికి, నిన్ను సాతాను బంధకములోనుండి విడిపించడానికి, పాపపు కట్లు త్రెంచివేయడానికి, నిన్ను శ్రీమంతునిగా చేయడానికి, నిన్ను ఆశీర్వదించడానికి దిగి వచ్చాడు. నశించినదానిని వెదకి రక్షించడానికి, తండ్రియైన దేవునితో సహవాసము కోల్పోయిన మనలను ఆయన సిలువ మరణముద్వారా రక్షించి తండ్రితో బంధమును, సహవాసము కల్పించాడు. నిత్యనరకాగ్నిపాలు కావలసిన మనలను నిత్యరాజ్యమునకు వారసులుగా చేయడానికే ఆయన దిగివచ్చాడు.

కొన్నిసార్లు నీవు, నీకున్న స్థానములోనుండి కొద్దిగా క్రిందికి దిగాలంటే, నీవు తగ్గించుకోవలసి వస్తే అంతగా ఆలోచించకు. నీ ప్రభువు నీకు మంచి మాదిరి చూపాడు. నిన్ను రక్షించడానికి ఆయన పరలోక భాగ్యమును విడిచి దిగివచ్చాడు. నీవున్న స్థానములోనుండి కొద్దిగా దిగి నిన్ను నీవు తగ్గించుకొని పేదలకు, బీదలకు సహాయము చేయి. రోగులను దర్శించి వారి నిమిత్తము ప్రార్థించు. బాధలలో ఉన్నవారిని పరామర్శించు. గుండె చెదరినవారిని ఆదరించు, వారి గాయములు కట్టు, దీనులకు సువార్త ప్రకటించు. ఇవి చేయడానికి వెనుకాడకు. ఆయన మనకొరకు పరలోకము నుండి దిగాడు. ఆయన సేవ నిమిత్తము నిన్ను నీవు తగ్గించుకోవలసి వస్తే వెనుకంజ వేయకు.

## 364. సిద్ధపరచినవాడు - 2 కొరింథీ. 5:5

**"భూమిమీద మన గుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము. మనము దిగంబరులము కాక వస్త్రము ధరించుకొనినవారముగా కనబడుదుము. కాబట్టి పరలోకమునుండివచ్చు మన నివాసము దీనిపైని ధరించుకొన నపేక్షించుచు దీనిలో మూల్గుచున్నాము. ఈ గుడారములోనున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము. ఇది తీసివేయవలెనని కాదు గాని మర్త్యమైనది జీవముచేత మ్రింగివేయబడునట్లు, ఆ నివాసమును దీనిపైని ధరించుకొన గోరుచున్నాము. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మన కనుగ్రహించి యున్నాడు."** - 2 కొరింథీ. 5:1-5

భూమిమీదనున్న గుడారము అంటే శరీరము. పౌలు భక్తుడు శరీరమును గుడారమని ఎందుకన్నాడంటే శరీరము తాత్కాలికమైనది. శరీరమనే ఈ గుడారములో ఆత్మ నిత్యనివాసమైన పరలోకము చేరుకోవడానికి మూల్గుతుంది. శరీరము నశిస్తుంది కాని ఆత్మ నిత్యము నిలుస్తుంది. ఆత్మ ఒకరోజు ఈ మట్టి దేహమును వదలి తండ్రియైన దేవుని యొద్దకు చేరుతుంది. శాశ్వతమైన నివాసముకొరకు, మహిమ శరీరము కొరకు, వాడబారని మహిమ కిరీటముకొరకు నిన్ను ఈ లోకములో సిద్ధపరచినవాడు యేసుక్రీస్తు. నేనే పునరుత్థానమును జీవమునని చెప్పాడు.

సిద్ధపరచినవాడు మనకొరకు ఏమి సిద్ధపరిచాడంటే రక్షణ మార్గము, నిత్యజీవము, పరలోకరాజ్యము. ఆయన పరమునుండి భువికి దిగి తన్ను తాను తగ్గించుకొని సిలువ మరణము పొందునంతగా తండ్రికి విధేయత చూపాడు.

**"అందుకు యేసు-పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు."** - యోహాను 11:25,26

యేసుప్రభువు శరీర మరణముగూర్చి చెప్పడము లేదు గాని ఆత్మకు మరణము లేదు అని అంటున్నాడు. ఆయనయందు విశ్వాసముంచువాడు నశింపక నిత్యజీవమునకు వారసుడవుతాడు. ఈ నిత్యజీవమునకు, పరలోకములోని శాశ్వతమైన నివాసమునకు నీకు మార్గము సిద్ధపరచిన వాడు యేసుప్రభువే.

**"మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును."** - యోహాను 14:1-3

నేను మిమ్మును రక్షించడానికి పరలోకమునుండి దిగాను. తండ్రి చిత్తము సంపూర్ణముగా నెరవేర్చి తిరిగి పరలోకమునకు ఆరోహణమై వెళతాను. అక్కడ నాతో పాటు మీరు ఉండులాగున మీకొరకు స్థలము సిద్ధపరుస్తాను అంటున్నాడు. మన నిత్యమైన నివాసము పరలోకమందున్నది. అది

చేరుకోవడానికే ఆత్మ సిద్ధపడుతుంది. శరీరమనే గుడారము శిథిలమై నశించిపోతుంది. కాని ఎటువంటి నాశనము, అంతము లేని నిత్యమైన మహిమ శరీరము పొందడానికి ఆత్మ మూల్గుతుంది. ఆత్మ అను సంచకరువును మనకనుగ్రహించి యున్నాడు. కనుక భయపడే అవసరము లేదు. శాశ్వతమైన నివాసముకొరకు పరిశుద్ధాత్ముడే మనలను గురిచేసుకొని గద్దిస్తు, శిక్షిస్తు, వాక్యముచేత హెచ్చరిస్తు మనలను సిద్ధపరుస్తున్నాడు.

దేవుని వాక్యము వాడియైన రెండంచులు గల ఆత్మఖడ్గము. కొన్నిసార్లు దేవుని సేవకులు వాక్యము అందిస్తున్నప్పుడు అది నీ హృదయములో గుండా దూసుకు వెళుతుంది. నీకు గాయమవుతుంది. అప్పుడు నీవు బాధపడనవసరము లేదు. దేవుడు తన వాక్యముద్వారా నిన్ను గద్దించి సరిచేస్తున్నాడు. సిద్ధపరచువాడైన దేవుడు నీ ఆత్మను సిద్ధపరుస్తున్నాడని గ్రహించి దేవుని స్తుతించాలి. కాని కొందరికి దేవుని వాక్యము సాత్వికముతో అంగీకరించే మనస్సు ఉండదు. వారనుకుంటారు ఈ రోజు మమ్మల్ని ఉద్దేశించి ప్రసంగము చేస్తున్నారని. పరిశుద్ధాత్మతో నింపబడిన దేవుని సేవకులు ఎవరినో ఒకరిని ఉద్దేశించి ఎప్పుడూ మాట్లాడరు. ఆత్మపూర్ణులై ఆత్మావేశముతో పరిశుద్ధాత్ముడు ఏమి మాట్లాడమంటే అదే మాట్లాడుతారు. దేవుడు సంఘముతో చెప్పమనే ప్రతిమాట కాపరులుగా మేము పలకాలి. మా సొంత తెలివి, జ్ఞానముతో దేవుని మాటలకు అడ్డుకట్టవేస్తే మేము శిక్షార్హులము అవుతాము. ఆత్మ నడిపించిన ప్రకారము ఏమి మాట్లాడమంటే అది మాట్లాడాలి. అలా మాట్లాడకుంటే సేవకులమైన మేము దేవునికి జవాబుదారులమౌతాము. వాక్యము దేవునిది. నిన్ను సరిచేయడానికి దేవుని వాక్యము నీయొద్దకు వచ్చినప్పుడు దానికి లోబడి నిన్ను నీవు సరిచేసికొని సిద్ధపడాలి.

ఒక పెండ్లికుమారుని ఎదుర్కొనడానికి పెండ్లికుమార్తె ఎంతగా సిద్ధపడుతుంది. వివాహమునకు ముందునుండే నలుగుపెడతారు. అలంకరిస్తారు. వివాహము రోజైతే ఇంక చెప్పే అవసరమే లేదు. ఎంతగా అలంకరిస్తారంటే పెండ్లికూతురు మాటిమాటికి అద్దములో చూసుకుంటుంది. అంతా సరిగా ఉందా? లేకుంటే ఇంకా ఏదైనా కొదువగా ఉందా అని. లోకరీతిగా ఇంతగా సిద్ధపడితే మరి పెండ్లికుమారుడుగా రానైయున్న యేసుప్రభువును ఎదుర్కొనడానికి సంఘమనే వధువు ఎంతగా సిద్ధపడాలి? నిత్యనివాసమైన పరలోకరాజ్యమును ఎదుర్కొనడానికి నీవు అనుక్షణము దైవస్వరమునకు లోబడాలి. నిన్ను నీవు పరిశుద్ధపరచుకోవాలి. పరిశుద్ధాత్మ అనే సంచకరువును దేవుడు మనకనుగ్రహించాడు. నీకు శిథిలమైపోయే శరీరమనే గుడారములో కొన్నిసార్లు నొప్పి, బాధ, నిందలు, అవమానములు, రోగము, దెబ్బలు అనుభవించవలసి వస్తుంది. కాని భయపడకు. పరిశుద్ధాత్ముడు నీ క్రుంగిన స్థితిలో నిన్ను ఆదరిస్తాడు, ధైర్యపరుస్తాడు. అందుకే భక్తులు ఏ విషయమునకు భయపడరు. వారికి తెలుసు ఈ లోకము తాత్కాలికమని, జీవించినన్ని రోజులు దైవచిత్తము నెరవేరుస్తారు. దేవుని పిలుపు వచ్చినప్పుడు సంతోషముగా ఈ లోకయాత్ర ముగిస్తారు. వారి ఆత్మ నిత్యుడైన దేవుని సన్నిధికి చేరుకుంటుంది. మరణము సహజము. అది నిన్ను పరలోకమునకు చేర్చే వాహనము లాంటిది. కనుక మరణమునకు భయపడనవసరము లేదు. పౌలు భక్తుడైతే బ్రతుకుట క్రీస్తు, చావైతే లాభము అంటున్నాడు. తాత్కాలికమైన ఈ లోకములో దేనికీ భయపడనవసరము లేదు. నీవు భయపడవలసింది నీ దేవుడైన యెహోవాను బట్టియే. నీకు దైవభయము లేకుండా దేవునికి అవిధేయుడవై నీ ఇష్టానుసారముగా జీవిస్తు ఆయన ఆజ్ఞలు మీరితే అప్పుడు ఆయన నీకు తగులు రాయిగా, అభ్యంతరము కలిగించు బండగా, బోనుగా, చిక్కువలగా మారిపోతాడు. ఆయన పరలోకమునుండి దిగివచ్చాడు. ఎందుకంటే ఆ పరలోక మహిమైశ్వర్యములో నిన్ను చేర్చడానికే. ఆ పరలోక నిత్య నివాసమునకు నిన్ను చేర్చుకొని నిత్యరాజ్యమునకు వారసులుగా సిద్ధపరచడానికే ఆయన వచ్చాడు. మరల రెండవసారి ఆయన నిన్ను కొనిపోవడానికి మధ్యాకాశములోనికి వస్తున్నాడు. ఆయన రాకడను ఎదుర్కొనడానికి సిద్ధపడియుండు. ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లాలంటే ఎంతగా సిద్ధపడతాము. ఎంతగా తయారవుతాము. ఈ లోకరీతిగా వున్న పార్టీ, ఫంక్షన్ కెళ్లడానికి ఇంతగా సిద్ధపడితే పరలోకము వెళ్లడానికి పరలోక విందును ఎదుర్కొనడానికి ఎంతగా సిద్ధపడాలి? సమస్తము సృష్టించిన ఆ సృష్టికర్తయైన దేవుని ఎదుర్కొనడానికి ఎంతగా సిద్ధపడాలో ఆలోచించండి.

## 365. పరిశుద్ధ స్థలము – యెషయా 8:13

**"సైన్యములకధిపతియగు యెహోవాయే పరిశుద్ధుడనుకొనుడి. మీరు భయపడవలసినవాడు ఆయనే. ఆయన కోసరమే దిగులుపడవలెను. అప్పుడాయన మీకు పరిశుద్ధస్థలముగా ఉండును."** – యెషయా 8:13

ఆయన నామము **'పరిశుద్ధ స్థలము'.** ఎప్పుడైతే నీవు దేవునికి విధేయుడవై, దైవభయముతో ఆయన ఆజ్ఞలు కట్టడలు అనుసరిస్తు దేవుని చిత్తమునకు సంపూర్ణముగా సమర్పించుకుంటావో అప్పుడు ఆయన నీకు పరిశుద్ధస్థలముగా మారిపోతాడు.

ఆరాధనలో చాలా మంది బయట కూర్చుని వాక్యము వింటున్నారు. ఒకవేళ ఇప్పుడు బోరున వర్షము కురిసిందని అనుకోండి. వారు వర్షములో తడుస్తు అలాగే నిలబడరు కాని తడువకుండ ఉండటానికి ఏదైనా షెల్టర్ దొరుకుతుందేమోనని పరుగెడతారు. దేవునికి విధేయులైనవారికి దేవుడు పరిశుద్ధస్థలముగా ఆశ్రయముగా మారిపోతాడు. దేవుడు నీకు పరిశుద్ధ స్థలముగా లేకుంటే నీ జీవితమంతా అనుమానముతో సందేహముతో దిగులు పడుతు పాపమునకు బానిసవై జీవిస్తావు. దేవునికవిధేయుడవై, దేవుని ఆజ్ఞలు మీరి సతమతమవుతు దేవునితో సహవాసము కోల్పోయి సాతాను బందీగా అయిపోతావు. అబ్బా, తండ్రీ అని మొఱ్ఱపెట్టుకునే స్వాతంత్ర్యము కోల్పోతావు. దేవుడు నీకై సిద్ధపరచినవన్ని కోల్పోయి నిత్య నరకాగ్ని పాలవుతావు. అక్కడ అగ్ని ఆరదు పురుగు చావదు. అప్పుడు నీవు పశ్చాత్తాపపడితే లాభము లేదు. సమయమున్నప్పుడే ఆయన నిన్ను కరుణించాలని నిలబడుతున్నప్పుడే దేవునికి విధేయుడవు కావాలంతే. అప్పుడాయన నీకు పరిశుద్ధస్థలముగా అయిపోతాడు.

ఈ లోకరీతిగా ఉండే కార్యములకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తే దేవునికంటే లోకమును ఎక్కువగా ప్రేమిస్తే దేవుని ఆశీర్వాదములు కోల్పోతావు. నేను పాపమేమి చేయడము లేదు. ఏదో చిన్న అవిధేయత అనుకుంటావు. కాని చిన్న అవిధేయత అనే చిల్లుద్వారా దివ్యమైన దేవుని ఆశీర్వాదములన్నీ నష్టపోతావు. కొందరు విశ్వాసులే కాని నోరు తెరిస్తే వాస్తునుగూర్చి మాట్లాడుతారు. వాస్తు అనే మాట విశ్వాసివైన నీ నోట వస్తే దేవుని కాపుదల

ఆశీర్వాదములు కోల్పోతావు జాగ్రత్త! యెహోవాయందు భయభక్తులు గల వారి చుట్టు ఆయన దూత కావలియుండి వారిని రక్షిస్తాడు. దేవునికిష్టము లేని పనులు చేస్తు, ఆయన శక్తిని సందేహించావంటే ఆయనకు భయపడకుండా దేనికో భయపడుతుంటే ఆయన నీకు పరిశుద్ధస్థలముగా ఉండడు. నీవు సృష్టిని ఆశ్రయిస్తు సృష్టికర్తను మరచిపోతే దేవుడెందుకు నీకు పరిశుద్ధస్థలముగా ఉంటాడు? నీవు వాస్తు అంటు, శని తొలగిపోతుందని రంగురాళ్లను ధరిస్తు అన్యులముందు దేవుని విసర్జిస్తున్నావు. నిన్ను బట్టియే దేవుని నామము అన్యజనులముందు దూషింపబడుతుంది. నీవు దేవునియందు విశ్వాసముంచకుంటే దేవునిశక్తిని నమ్మకుంటే విశ్వాసివి ఎలాగవుతావు? నీవు క్రైస్తవుడవని పిలువబడుతు అన్యులకంటే ఘోరమైన జీవితము గడుపుతుంటే నీవు ఇంక విశ్వాసిగా ఉండతగవు. మీరు జీవించుచున్నారనే పేరేగాని మృతులతో సమానము. నీవలన ఏమి లాభము? మనద్వారా దేవుని నామము మహిమ పరచబడాలి. నిన్ను చూచి నీ జీవితముద్వారా అన్యులు దేవుని స్తుతించాలి. ఇదిగో ఆ సహోదరికి దేవుడే పరిశుద్ధస్థలముగా ఉన్నాడు. యేసుక్రీస్తనే బండమీద గృహమును కట్టుకుంది. ఆమె దేవునియందు విశ్వాసముంచింది. ఆమె ముందు ఎలాంటి మంత్రశక్తులు చీకటిశక్తులు చెల్లవు. ఆమె హృదయము దేవుని ఆశ్రయించి స్థిరముగా, నిబ్బరముగా ఉందని అన్యులు దేవుని మహిమపరచాలి. ఆయన భక్తిహీనులను నిశ్చయముగా కాలుజారు చోటనే ఉంచియున్నాడు. ఆయన అవిధేయులకు తగులురాయి. అభ్యంతరము కలిగించు బండ, బోను, చిక్కువలగా ఉంటాడు. విధేయులకు దిగినవాడుగా, సిద్ధపరచువాడుగా, పరిశుద్ధస్థలముగా ఉంటాడు.

**"ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు, తండ్రుల దోషమును కుమారులమీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యితరములవరకు కరుణించువాడనై యున్నాను."**

– నిర్గ.కాం. 20:5,6

గణాంకశాస్త్రము లెక్కలనుబట్టి కొన్ని విషయాలు తెలిసికున్నారు. ఒక నాస్తికుడు ఒక అన్యురాలైన స్త్రీని వివాహము చేసికుంటే వారి సంతానము ఇలాగుంటుంది. వారి సంతానములో 567 మందిని పరిశీలిస్తే వారిలో 310 మంది దేశద్రోహులు, 150 మంది నేరస్థులు, 7 గురు హంతకులు, 100 మంది త్రాగుబోతులు. మిగిలిన వారిలో స్త్రీలు వ్యభిచారులు ఉన్నారు.

కాని రక్షింపబడిన వారి కుటుంములోని పిల్లలు, దేవునిచేత ఏర్పరచబడిన 1305 కుటుంబములు పరీక్షిస్తే వారి సంతానములో 12 మంది ప్రొఫెసర్స్, 65 మంది లెక్చరర్స్, ముగ్గురు ఐ.ఎ.ఎస్, 30 మంది న్యాయనిర్ణేతలు (జడ్జిలు), 60 మంది న్యాయవాదులు, 70 మంది రక్షణ, నావిక, విమాన దళములలో ఆఫీసర్స్, 100 మంది ప్రసంగీకులు, 60 మంది రచయితలు, ఒక్కరు యుఎస్ఎ వైస్ ప్రెసిడెంట్, 280 మంది పట్టభద్రులు ఉన్నారు.

ఈ రెండు పట్టీలను పరిశీలిస్తే రక్షింపబడినవారి సంతానమును దేవుడు ఆశీర్వదించి వర్ధిల్లచేస్తాడు. నాస్తికుడు, దేవుడు లేడనేవారి సంతానము దేశద్రోహులుగా నేరస్థులుగా మారుతున్నారని స్టాటిస్టిక్స్ లెక్కలు తెలుపుతున్నాయి. కావున దేవుని ఆశ్రయించాలి ఆయనకే భయపడాలి. యెహోవా తమకు దేవుడుగాగల జనులు ధన్యులు. ఎవనికి యాకోబు దేవుడు సహాయకుడగునో ఎవడు యెహోవాయందు ఆశపెట్టుకొనునో ఆ నరుడు ధన్యుడు కనుక దైవభయము కలిగి ఆయన ఆజ్ఞలు కట్టడలు అనుసరిస్తు ముందుకు సాగితే దేవుడే మీకు పరిశుద్ధస్థలముగా ఉంటాడు.

## 366. తృణీకరింపబడినవాడు – యెషయా 53:3

**"మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? యెహోవా బాహువు ఎవనికి బయలుపరచబడెను? లేతమొక్కవలెను ఎండిన భూమిలో మొలిచిన మొక్కవలెను అతడు ఆయనయెదుట పెరిగెను. అతనికి సురూపమైనను సొగసైనను లేదు. మనమతని చూచి, అపేక్షించునట్లుగా అతనియందు సురూపము లేదు. అతడు తృణీకరింపబడినవాడును ఆయెను. మనుష్యులవలన విసర్జింపబడినవాడును వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించినవాడుగాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను. అతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని ఎన్నికచేయక పోతిమి."**

– యెషయా 53:1-3

యేసుప్రభువు నామము **'తృణీకరింపబడినవాడు'.** ప్రవక్త అయిన యెషయా దాదాపు 700 సంవత్సరములకు ముందే యేసుప్రభువు సిలువ మరణమునుగూర్చి ఆత్మపూర్ణుడై ప్రవచించాడు. ప్రభువు మనుష్యులందరి చేత తృణీకరింపబడ్డాడు. ఎవరూ ప్రభువుని రక్షకుడని, దేవుని కుమారుడని నమ్మలేదు. సర్వలోకపాపపరిహారార్థము సిలువలో మరణించి, సర్వమానవాళికి విడుదల, రక్షణ అనుగ్రహించడానికే దివినుండి భువికి వచ్చాడనే సత్యమును నమ్మకుండ ప్రభువును తృణీకరించారు. ఆయన మాటలు నమ్మలేదు. ప్రభువును రక్షకుడిగా అంగీకరించకుండా తృణీకరించారు.

పరమగీతము 5వ అధ్యాయములో ప్రియుడైన యేసుప్రభువు ఎలాంటివాడో వివరింపబడింది. ధవళవర్ణుడు, రత్నవర్ణుడు, అతిసుందరుడు, అతికాంక్షణీయుడు, మనోహరుడు పదివేల మందిలో గుర్తింపదగినవాడు ఇలాంటి బహుసుందరుడైన ప్రభువు మన పాపపరిహారార్థము విమోచన క్రయధనము చెల్లించడానికి, మన రక్షణార్థము సిలువలో బహు వికారముగా మారాడు. మనమతని చూచి అపేక్షించునట్లు సొగసైనను, సురూపమైనను లేదని ప్రవక్త ప్రవచనము నెరవేరింది. అతి కాంక్షణీయుడు అందరూ కోరదగిన ప్రియ ప్రభువు అందరిచేత తృణీకరింపబడినవాడుగా అయ్యాడు.

ప్రభువుకు తెలుసు. తాను ప్రేమించిన శిష్యులు సహితము తనను విడిచిపోతారని, తృణీకరిస్తారని.

**"అప్పుడు యేసు వారిని చూచి – ఈ రాత్రి మీరందరు నా విషయమై అభ్యంతరపడెదరు, ఏలయనగా – గొఱ్ఱెల కాపరిని కొట్టుదును, మందలోని గొఱ్ఱెలు చెదరిపోవును అని వ్రాయబడి యున్నది గదా; నేను లేచిన తరువాత మీకంటె ముందుగా గలిలయకు వెళ్లెదననెను. అందుకు పేతురు – నీ విషయమై అందరు అభ్యంతర పడినను నేను ఎప్పుడును అభ్యంతరపడనని ఆయనతో చెప్పగా యేసు అతని చూచి –ఈ రాత్రి కోడి కూయక మునుపే నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పెదవని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. పేతురాయనను చూచి – నేను నీతోకూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పననెను; అదేప్రకారము శిష్యులందరు అనిరి."**

– మత్తయి 26:31-35

ఆయన కుటుంబము ప్రభువును తృణీకరించింది. అన్నదమ్ములు ప్రభువు మెస్సీయా అని గుర్తించలేకపోయారు. ప్రధానయాజకులు, పరిసయ్యులు, సద్దూకయ్యులు, రబ్బూనీలు ప్రభువుని తృణీకరించారు. వారు ప్రభువుకు ప్రవక్తకిచ్చే స్థానముకూడ ఇవ్వలేదు. ఇతడు వడ్లవాని కుమారుడు కాదా? ఇతడు సామాన్యుడే కదా, అద్భుతములు ఏ విధముగా జరిగిస్తున్నాడని ప్రభువుమీద నిందలు మోపారు. సొంత ప్రజలైన యూదులు ప్రభువు రక్షకుడని నమ్మలేదు. ఏ ప్రవక్తకూడ తన సొంత ఇంట ఘనత పొందడు. ఇది సాధారణముగా భక్తులందరికి సంభవించేదే. భక్తులు లోకమంతా ఘనత పొందుతారు. కాని సొంతవారు తృణీకరిస్తారు. ప్రభువు ఎవరి రక్షణార్థము వచ్చాడో వారే ప్రభువు రక్షకుడని నమ్మడము లేదు. రక్షకుడంటే రాజులా ఉండాలి. ఠీవి, హూందాతనముండాలి. రాజుకు రాజ్యముండాలి, సైన్యబలముండాలి. ఇతడికి రాజ్యము లేదు. సైన్యము లేదు. ఇతడు మమ్మల్నేమి రక్షిస్తాడని గేలిచేశారు. అపహసించి తృణీకరించారు. ప్రభువు ఎక్కడెక్కడ తృణీకరింపబడ్డాడో అక్కడ ఏ అద్భుతములు జరిగించలేదు. వారిలోని అవిశ్వాసమునుబట్టి ఆయన ఏ అద్భుతము చేయలేదు.

బాప్తిస్మము ఇచ్చు యోహాను ప్రభువునుగూర్చి –ఇదిగో లోక పాపమును మోసికొని పోవుచున్న దేవుని గొఱ్ఱెపిల్ల అని ప్రవచించాడు. ఈ లోక పాపమంత తండ్రియైన దేవుడు యేసుప్రభువుపై మోపాడు. అందుకే ప్రభువు గెత్సేమనే తోటలో సిలువ మరణమునకు ముందు బహు వేదనతో బహు దుఃఖాక్రాంతుడై తన చెమట రక్తబిందువులుగా మారునంతగా వేదనతో ప్రార్థిస్తాడు. నా తండ్రీ, సాధ్యమయితే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్మని ప్రార్థిస్తాడు. గిన్నెలోనిది నేను త్రాగలేను అంటున్నాడు. ఆత్మసిద్ధమే గాని శరీరము బలహీనమని అంటున్నాడు. ఆ గిన్నె లోక పాపముతో పోల్చబడింది. సర్వలోక పాపప్రాయశ్చిత్తముకై ప్రభువు సిలువలో తన రక్తమును చిందింపవలసి ఉంది. బహు ఘోరమైన సిలువ శ్రమలు సహించడానికి, శక్తి పొందడానికే ప్రభువు గెత్సేమనే తోటలో ప్రార్థనలో గడిపాడు. ప్రార్థన ముగించి కొండదిగి వస్తుండగా ఆయన శిష్యులలో ఒకడైన యూదా దొంగ ముద్దు పెట్టి ప్రభువును పట్టుకొని ప్రధాన యాజకుడైన కయపయొద్దకు తీసుకొని వెళ్లారు. వారు ప్రభువును మరణమునకు పాత్రుడని తీర్పు తీరుస్తారు.

**"అప్పుడు వారు – వీడు మరణమునకు పాత్రుడనిరి. అప్పుడు వారు ఆయన ముఖముమీద ఉమ్మివేసి, ఆయనను గుద్దిరి; కొందరు ఆయనను అరచేతులతో కొట్టి –క్రీస్తూ నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపు మనిరి."**

– మత్తయి 26:66–68

యూదులకు భయపడి శిష్యులందరు ప్రభువును ఒంటరిగా విడిచి పారిపోతారు. ప్రధానయాజకులు ప్రజల పెద్దలందరు యేసును చంపింపవలెనని ఆయనకు విరోధముగా ఆలోచన చేసి యేసును బంధించి పిలాతుకు అప్పగిస్తారు. అప్పుడు పిలాతు, బరబ్బను విడుదల చేయాలా? క్రీస్తును విడుదల చేయాలా? అని ప్రశ్నించినప్పుడు బరబ్బను కోరుకొని క్రీస్తును తృణీకరించారు. ప్రజలందరు యేసును సిలువ వేయుమని కేకలు వేస్తారు. పిలాతు ప్రజలు కోరిన ప్రకారము ప్రభువును సిలువ వేయడానికి అప్పగిస్తాడు.

తండ్రియైన దేవుని చిత్తము నెరవేర్చడానికి రక్షణ సంకల్పము జరిగించడానికి ప్రభువు బాధింపబడినను నోరు తెరువలేదు. వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు ఆయన నోరు తెరువలేదు. అందరూ ప్రభువును తృణీకరించారు. ప్రభువుచేత అద్భుతములు పొందిన ప్రజలుకూడ ప్రభువును సిలువ వేయుమని కేకలు వేస్తున్నారు. శిష్యులు తృణీకరించారు. ప్రజలు తృణీకరించారు. సొంత ఇంటివారుతృణీకరించారు. స్వదేశీయులు తృణీకరించారు. ప్రభువు – రక్షకుడని, మెస్సీయ అని, అభిషిక్తుడని వారు గ్రహించక ప్రభువును సిలువకు అప్పగించారు. ఎవరి రక్షణార్థము ప్రభువు వచ్చాడో ఆ ప్రజలే ప్రభువును తృణీకరించి సిలువకప్పగించారు.

ఈ రోజు దేవుని వాక్యము చదువుతున్న దేవుని బిడ్డా! క్రైస్తవ జీవితములో నీవు ప్రభువుకొరకు సాక్షిగా నిలబడినప్పుడు ప్రజలు నిన్ను తృణీకరించి నప్పుడు ఈ నామమెత్తి ప్రార్థించు. ప్రభువా, ఈ లోకము నాకంటే ముందుగా నిన్నే తృణీకరించింది. నేనేపాటి వాడను? ఏపాటి దానను? ప్రభువా, నీవు చూపిన సిలువదారిలో నిన్నే గురిగా సిలువను మోస్తు సాగిపోవడానికి శక్తి అనుగ్రహించుమని ప్రార్థించు. నీవు సత్యముకొరకు నిలబడి తృణీకరింపబడితే ప్రభువు సిలువ శ్రమలలో పాలివాడయినంతగా ఆనందించు. ప్రభువును స్తుతించు.

## యు.పి.ఎఫ్. 31వ వార్షికోత్సవము

జూన్ 20, 2023న సాయంత్రం 4 గంటల నుండి రా॥ 9 గంటల వరకు యు.పి.ఎఫ్. 31వ వార్షికోత్సవము ఉస్మానియా గార్డెన్స్, జామై ఉస్మానియాలో ఎంతో జయకరముగా జరిగింది. బిషప్ తిమోతి గారు ముఖ్య అతిథిగా పాల్గొని "సేవకుని లక్షణాలు" అనే వర్తమానము అందించారు. రెవ.డా. జాయ్ చెరియన్ గారు బిషప్ తిమోతి గారి సతీమణి మార్తా గారు, సహోదరి రేచెల్ శాంతి గారు, సహోదరి ఆలీస్ ఫిల్‌బర్ట్ గారు యు.పి.ఎఫ్. ద్వైమాస పత్రిక **"దెబోరా స్వరం"** విడుదల చేశారు. అమ్మగారు ఎనిమిది మందికి ఆర్డినేషన్ ఇచ్చారు. బిషప్ తిమోతి గారు, రెవ.డా. జాయ్ చెరియన్ గారు, రెవ. టి.ఎం. కుమార్ గారు ఎవాంజిలిస్ట్‌లుగా ఆర్డినేషన్ పొందిన బ్రదర్ జోసెఫ్ రాయ్, బ్రదర్ జాషువా శాం ఫిల్బర్ట్, సహోదరుడు సూర్య మరియు సంఘ పెద్దలుగా ఆర్డినేషన్ పొందిన బ్రదర్స్ చంద్రపాల్, ఆనందరావు, స్టెర్జీరాజన్, సృజన్ కుమార్, కృష్ణారెడ్డి దంపతులను నూనె రాచి హస్త నిక్షేపణ ప్రార్థనలు చేశారు. అమ్మగారు ఆర్డినేషన్ ఒప్పందాలను వారితో చేయించారు. అమ్మగారి ప్రథమ కుమారుడు బ్రదర్ అఖిల్ చెరియన్ గారు కేక్ కటింగ్ కార్యక్రమములో పాల్గొని అమ్మగారికి శుభములు తెలియజేశారు. యు.పి.ఎఫ్. సండే స్కూల్ టీచర్స్, స్టాఫ్ & వాలంటీర్లు, సంఘ సభ్యులు అమ్మగారు, అయ్యగారిని శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపి గౌరవించారు. ప్రేమ విందు ఏర్పాటు చేయబడింది.

"ఆయన ఉదకబిందువులను పైనుండి కురిపించును మంచుతోకూడిన వర్షమువలె అవి పడును." - యోబు 36:27

# దేవుని వెయ్యి వాగ్దానములు

## 166. ఆయన తన వాక్కును పంపి వారిని బాగుచేసెను."

– కీర్తనలు 107:20

దేవుని బిడ్డలు శ్రమలలో ఉన్నప్పుడు దేవుని వాక్కు ప్రత్యక్షమవుతుంది. దేవుడు తన వాక్కును పంపి వారిని బాగుచేస్తాడు. హిజ్కియారాజుకు మరణకరమైన రోగము వచ్చినప్పుడు దేవునివాక్కు ప్రవక్తద్వారా అతనియొద్దకు వచ్చింది. శత్రువులు బెదిరించినప్పుడు దేవునివాక్కు అతని యొద్దకు వచ్చింది. కష్టకాలమందు దేవునిబిడ్డలు దేవునికి మొఱ్ఱపెడతారు. దేవుడు తన వాక్కును పంపి వారిని బాగుచేస్తాడు, ఆదరిస్తాడు ధైర్యపరుస్తాడు స్వస్థపరుస్తాడు. వారిని విడిపిస్తాడు.

**"కష్టకాలమందు వారు యెహోవాకు మొఱ్ఱపెట్టిరి ఆయన వారి ఆపదలలోనుండి వారిని విడిపించెను. ఆయన తన వాక్కును పంపి వారిని బాగుచేసెను. ఆయన వారు పడిన గుంటలలోనుండి వారిని విడిపించెను."**

– కీర్తనలు 107:19,20

దేవుని వాక్కులు ఎంత శక్తిగలవంటే అవి బండను పగులగొట్టే సుత్తె వంటిది. అగ్నివంటిది. దేవుని వాక్యము సజీవమైనదై ఎటువంటి హృదయములో గుండానైనా దూసుకొని పోతుంది.

**"నా మాట అగ్నివంటిదికాదా? బండను బద్దలుచేయు సుత్తె వంటిది కాదా?"** – యిర్మియా 23:28

**"ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను శోధించుచున్నది."** – హెబ్రీ 4:12

కొన్నిసార్లు గుండె చెదరి భయభీతులతో దేవుని మందిరమునకు వస్తావు. అక్కడ దేవుని సేవకుల నోటినుండి శక్తిగల అగ్నివంటి దేవుని కాక్కులు విడుదల కాగానే అది నీ హృదయములోనున్న చెత్తను కాల్చివేస్తుంది. నీలోనున్న భయము భీతి ఆందోళన అవిశ్వాసము సంశయములన్నీ తొలగిస్తుంది. నీ చీకటి చింతలన్నియు తొలగిపోయి హృదయమంతా తేలికగా అనిపిస్తుంది. ధైర్యముతో నింపబడతావు. అందుకే దేవుని సేవకులు వాక్యము అందించినప్పుడు శ్రద్ధగా దేవుని వాక్కులు వినాలి. కొన్నిసార్లు వైద్యులు చేతులెత్తేసిన నయముకాని వ్యాధులుకూడ బాగవుతాయి. దేవుని వాక్యము జీవము గలది. అది నిన్ను జీవింపజేస్తుంది. నీ శ్రమలలో నీకు ఆదరణ కలుగుజేస్తుంది. మనము దేవుని ఆరాధిస్తున్నప్పుడుకూడ దేవుని శక్తిని అనుభవిస్తాము. ఆరాధనలో ఎంతో మంది స్వస్థత పొందుతారు. ఈ మధ్యలోనే నేను ఒక సాక్ష్యము విన్నాను. ఒక సహోదరి ఆదివారపు సాయంకాల ఆరాధనకు వచ్చి కూర్చోగానే ఆ సహోదరి బి.పి. డౌన్ అయిపోయి తల తిరుగుతున్నట్టు అన్పించగానే యింటికి తిరిగి వెళ్లిపోదామని అనుకున్నదట. నేను స్టేజిమీదకెక్కి ఆరాధన మొదలు పెట్టగానే ఆరాధనలో పాలుపొంది వెళతానని అనుకొన్నదట. నేను ఆరాధనలో దేవుని స్తుతిస్తూ – దైవాత్మ ప్రేరణతో అనారోగ్యముతో ఈ ఆరాధనలో ఎవరైన ఉన్నట్లయితే దేవుడు వారిని స్వస్థపరుస్తున్నాడని అన్నానట. నిన్ను స్వస్థపరచే దేవుడు యెహోవా రాఫా అంటూ స్తుతిస్తూ ఆరాధిస్తున్నప్పుడు ఆ సహోదరికి వెంటనే స్వస్థత కలిగిందని, నూతన శక్తితో బలముతో నింపబడ్డానని సాక్ష్యమిచ్చి దేవుని మహిమపరచింది. దేవుడు తన వాక్కును పంపి బాగుచేస్తాడు. ఆయన వాక్కు ఔషధములాగా పనిచేస్తుంది.

అందుకే దేవునివాక్కుకొరకు కనిపెట్టాలి. ప్రార్థించాలి. కావలివారు ఉదయముకొరకు కనిపెట్టురీతిగా దేవుని బిడ్డలు దేవుని మాటలకొరకు కనిపెట్టాలి. దేవుడు తన దాసులద్వారా దాసురాలిద్వారా ఏమి మాట్లాడనైయున్నాడోనని ఆశతో కనిపెట్టుకోవాలి. పరిశుద్ధ గ్రంథము చదువుతున్నప్పుడు దేవా, నాతో మాట్లాడుమని ప్రార్థించాలి. దేవునివాక్కు కొరకు ఎల్లప్పుడు తృష్ణగొనియుండాలి. శక్తిగల దేవునివాక్యము విడుదల అయినప్పుడు నీ కట్లు తెగిపోతాయి. దేవుడు తన వాక్కును పంపి నిన్ను బాగుచేస్తాడు. నీకు ఆదరణ నెమ్మది కలుగుతాయి. స్వస్థత కలుగుతుంది. భయములనుండి విడుదల పొందుతావు. నీ హృదయములోనున్న చీకటి తొలగిపోయి దేవుని వాక్యపు వెలుగుతో నింపబడతావు. అందుకే కీర్తనకారులు దేవుని ధర్మశాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలుగుతుంది. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియు లేదని దేవుని వాక్యము నిన్ను బ్రదికిస్తుంది. దేవునివాక్కుచేతనే ప్రపంచములు నిర్మాణములైనవని హెబ్రీ పత్రికలో వ్రాయబడింది.

**"ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము."** – హెబ్రీ 11:2

**"తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు..."**

– హెబ్రీ 1:4

దేవుని వాక్యము శక్తిగలదని నీకు విశ్వాసముండాలి. దేవుడు నాతో మాట్లాడాడు. తప్పకుండ నాపట్ల కార్యము జరిగిస్తాడనే విశ్వాసము నిరీక్షణ నీకుండాలి. ఒక మాట పలుకుము దేవా, మా జీవితములు ధన్యమవుతాయని పాట పాడటమే కాదు, ఆయన మాటలు నమ్మాలి. దేవుని మాటలను ఎప్పుడూ త్రోసివేయకూడదు. దేవుని వాక్కును తక్కువ అంచనా వేయకూడదు. దేవుని మాటలు బయలు వెడలాయంటే అవి నిరర్థకము కావు. ఆయన వాక్కుతో సృజనాత్మకత శక్తి ఉంది. దేవుని మాటలు ఎంతగా హత్తుకుంటే అంతగా నీ బ్రతుకు బాగవుతుంది. నేను ఎల్లప్పుడు దేవా, నాతో మాట్లాడుమని ప్రార్థిస్తాను. నాకు గాఢ నిద్ర పట్టినప్పుడు దేవుడు మాట్లాడుతాడు. నేను వెంటనే లేచి కూర్చుని దేవుడు సెలవిచ్చిన మాటలు డైరీలో వ్రాసుకుంటాను. ఆ మాటలు ప్రజలకు అందించినప్పుడు ప్రజలు విడుదల పొందుతారు. వారి కట్లు తెగిపోతాయి. దేవునికి స్తోత్రము. ఆయన తన వాక్కుచేత ప్రపంచములను నిర్మించాడు. కాబట్టి నీవు ఎలాంటి పరిస్థితులలోనున్న ఆయన వాక్కు నీకు విడుదలనిస్తుంది. నిన్ను బాగుచేస్తుంది. నీ చిక్కులన్నీ తొలగిపోయి నీ పరిస్థితులు చక్కబడతాయి. చచ్చిన వారినికూడ దేవునివాక్యము బ్రదికిస్తుంది. చనిపోయి పాతి పెట్టబడి నాలుగు రోజులయిన తరువాత యేసుప్రభువు లాజరు సమాధి దగ్గరకు వచ్చి – 'లాజరు బయటకు రా' అనగానే బయటకు వచ్చాడు. యేసుక్రీస్తు ప్రభువు మాటలోనున్న శక్తి. ఈ మనిషి మారడము అసాధ్యమని నీవనుకుంటావు కాని శక్తిగల దేవుని వాక్యము అతని హృదయములోకి దూసుకొని పోయినప్పుడు ఎట్టి బండలాంటి హృదయమైనా బ్రద్దలు కావలిసిందే. ఆత్మీయముగా చచ్చిన వారిని దేవుని వాక్యము బ్రదికిస్తుంది. ఆయన తన వాక్కు పంపి బాగుచేస్తాడు.

మన సంఘములో కూడుకున్నప్పుడెల్లా దేవుని వాగ్దానములు పంచిపెడతాము. అనేకులు ఆ వాగ్దానములద్వారా బలము పొందుతున్నట్లు ఆదరింపబడినట్లు సాక్ష్యమిచ్చి దేవుని మహిమపరుస్తారు. జీవముగల దేవుని వాక్యము నీయొద్దకు వచ్చినప్పుడు అది కార్యమును జరిగిస్తుంది.

**"వర్షమును హిమమును ఆకాశమునుండి వచ్చి అక్కడికి ఏలాగు మరలక భూమిని తడిపి విత్తువానికి విత్తనమును భుజించువానికి ఆహారమును కలుగుటకై అది చిగిర్చి వర్ధిల్లునట్లు చేయునో ఆలాగే నా నోటనుండి వచ్చువచనమును ఉండును. నిష్ఫలముగా నాయొద్దకు మరలక అది నాకు అనుకూలమైన దాని నెరవేర్చును నేను పంపిన కార్యమును సఫలము చేయును."** – యెషయా 55:10,11

దేవుడు సెలవిచ్చిన ఏ మాటకూడ నిరర్థకము కాదు. నిష్ఫలముగా అది వెనుకకు మరలదు. కాబట్టి జీవముగల దేవుని మాటలయందు విశ్వాసముంచినప్పుడు అది నిన్ను బాగు చేస్తుంది. నీ కష్టకాలములో నిన్ను విడిపిస్తుంది. నీ యిబ్బందులలో నిన్ను ఆదరించి పరామర్శిస్తుంది. నీ అనారోగ్యములో స్వస్థత కలుగజేస్తుంది. నీ బంధకములు కట్లు తెగిపోతాయి. దేవుడు తన వాక్కును పంపి నిన్ను బాగుచేస్తాడు. దేవునికి స్తోత్రము. హల్లెలూయ.

## 167. యథార్థవంతులకు ఆయన తోడుగా నుండును." – సామెతలు 3:32

యథార్థవంతులకు దేవుడు ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. ఇది దేవుని నియమము. నీతిమంతులు నశించిపోయారని యథార్థవంతులు పతనమయిపోయారని ఎవరైనా ఎపడైనా ఎక్కడైనా విన్నారా? చూశారా? నేనైతే వినలేదు చూడలేదు. నీతిమంతులు చిగురాకువలే వృద్ధినొందుతారు. యథార్థవంతులు వర్ధిల్లుతారు. అందుకే దావీదు భక్తుడు ఈ విధముగా అంటున్నాడు. – **"నేను చిన్నవాడనై యుంటిని ఇప్పుడు ముసలి వాడనైయున్నాను. అయినను నీతిమంతులు విడువబడుట గాని వారి సంతానము భిక్షమెత్తుటగాని నేను చూచియుండలేదు. దినమెల్ల వారు దయాళులై అప్పు ఇచ్చుచుందురు. వారి సంతానపువారు ఆశీర్వదింప బడుదురు."** – కీర్తనలు 37:25,26

ఎందుకంటే యథార్థవంతులకు దేవుడు ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. మన ముస్లిమ్ సహోదరులు ఉర్దూ భాషలో "జితనా నీయత్ ఉత్‌నా బర్‌కత్" నీయత్ మే కత్‌రా జోలీ మే పత్‌రా" అని అంటుంటారు. నీ నీయత్ ఎంత ఉంటుందో నీ బర్‌కత్ అంతగా ఉంటుంది. "నీ నీతికి తగినట్లుగా ఆయన నీ నివాసస్థలమును వర్ధిల్లజేస్తాడు" "నీవు పవిత్రుడవై యథార్థవంతుడవైన యెడల నిశ్చయముగా ఆయన నీయందు శ్రద్ధ నిలిపి నీ నీతికి తగినట్టుగా నీ నివాసస్థలమును వర్ధిల్లజేస్తాడు" **"నీవు పవిత్రుడవై యథార్థవంతుడవైన యెడల నిశ్చయముగా ఆయన నీయందు శ్రద్ధ నిలిపి నీ నీతికి తగినట్టుగా నీ నివాసస్థలమును వర్ధిల్లజేయును. అప్పుడు నీ స్థితి మొదట కొద్దిగా నుండినను తుదను నీవు మహాభివృద్ధి పొందుదువు."** – యోబు 8:6

కొందరు అక్రమముగా డబ్బు సంపాదించి గొప్పవారు కావాలని అనుకుంటారు లంచము డబ్బుతో పైకి రావాలని ప్రయత్నిస్తారు. లంచము పుచ్చుకొనేవారిని దేవుని నామములో హెచ్చరిస్తున్నాను. జాగ్రత్త, నీవు లంచము తీసికుంటే నీ నోరు మంటితో నింపబడుతుందని వాక్యములో వ్రాయబడింది. నీవు వంకరత్రోవలలో నడచుకుంటూ దేవుని క్రమము తప్పుతావో అప్పుడు దేవుని సన్నిధి నిన్ను విడిచిపోతుంది. సత్యమునకు అసత్యముతో ఏమి పొత్తు? చీకటికి వెలుగుతో ఏమిపొత్తు? నీతికి అవినీతికి ఏమిపొత్తు? పాపము చేస్తూ అక్రమమైన మార్గములలో నడుచుకుంటూ దేవునితో ఏలాగు నడువగలవు? హనోకు దేవునితో నడిచాడు. నోవహు దేవునితో నడిచాడు. అబ్రహాము దేవునితో నడిచాడు. ఎందుకంటే వారు పవిత్రమైన యథార్థప్రవర్తన కలిగినవారు అందుకే దేవుడు వారి సహవాసము కోరుకున్నాడు. ఒక స్నేహితుడివలే వారితో మాట్లాడుతూ వారితో నడిచాడు. ఎల్లప్పుడు దేవునితోడు దేవుని సహాయము వారితో ఉంది. నీవు దేవుని నియమములు అనుసరించకుండ అక్రమము అన్యాయముచేస్తూ దేవునితో నడుస్తానంటే దేవుడు నీతో నడువడు గాని నిన్ను భ్రష్టమనస్సుకు అప్పగిస్తాడు.

యథార్థవంతులకు దేవుడు ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. ఇది గొప్ప దేవుని వాగ్దానము. దేవుడు యోబు భక్తునిగూర్చి ఈ విధముగా సాక్ష్యమిచ్చాడు. **"ఊజుదేశమందు యోబు అను ఒక మనుష్యుండుండెను. అతడు యథార్థవర్తనుడును, న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు."** – యోబు 1:1

అందుకే ఎల్లప్పుడు దేవుడు యోబుకు తోడుగా ఉన్నాడు సమస్తము సమృద్ధిగా కలిగియున్నప్పుడు తోడుగా ఉన్నాడు. సమస్తము కోల్పోయినప్పుడు శ్రమలలో ఉన్నప్పుడు దేవుడు అతనికి తోడుగా ఉన్నాడు.

యోబు భక్తుడు అనుభవించిన శ్రమలు ఎవ్వరు అనుభవించియుండరని అనుకుంటున్నాను. అగ్నిలో పుటము వేయబడినట్లుగా అగ్నిలాంటి శ్రమలగుండా వెళ్లినా దేవునితోడు ఎల్లప్పుడు యోబుభక్తునికి ఉంది. అందుకే కొంతకాలము శ్రమలనుభవించిన తరువాత యోబు భక్తుని దేవుడు మునుపటికంటే అధికముగా ఆశీర్వదించాడు. పోగొట్టుకున్న సమస్తమును రెడంతలుగా పొందాడు. దేవునికి స్తోత్రము. దేవుడు నీ పక్షమందుంటే నీకు విరోధి ఎవరు? దేవుడు తమకు తోడుగాగల జనులు ధన్యులు. సాధారణముగా మనకు ఎవరైనా తోడుగా ఉండాలని, ఎవరైనా సహాయము చేయాలని ఆశిస్తాము. కానీ ఏ మనుష్యుడు ఎల్లప్పుడు నీకు తోడుగా ఉండడు. వారికి అనుకూలముగా ఉంటే నీతో ఉంటారు. వారికి పరిస్థితులు అనుకూలించకపోతే నిన్ను విడిచిపోతారు. కాని దేవుడు శాశ్వత కాలము నీకు తోడుగా ఉంటాడు. ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడైయున్నాడు. నిన్ను విడువడు ఎడబాయడు. శ్రమలలోనైనా దుఃఖములోనైనా సంతోషములోనైనా అనుకూల పరిస్థితులలోనైనా ప్రతికూల పరిస్థితులైనా కరవులోనున్నా సమృద్ధిలోనున్నా అన్ని పరిస్థితులలో ఎల్లప్పుడు సదాకాలము నీకు దేవుడిగా ఉంటాడు. యుగసమాప్తివరకు సదాకాలము మనకు తోడుగా ఉంటాడు. ఎవరి మనస్సు దేవునిమీద ఆనుకొనియుంటుందో వారిని దేవుడు పూర్ణశాంతిగలవారిగా చేస్తానని వాగ్దానము చేస్తున్నాడు. దేవుడు నీకు ఎల్లప్పుడు తోడుగా ఉండి నీ శ్రమలన్నిటిలోనుండి నిన్ను విడిపించి నిన్ను ఆశీర్వదిస్తాడు. నీ బాధలలో నెమ్మదినిస్తాడు. దుఃఖములో ఓదార్పునిస్తాడు ఆదరిస్తాడు ధైర్యపరుస్తాడు. దేవుడు తన వాక్కును పంపి నిన్ను బాగుచేస్తాడు. విశ్వాసులు ఎల్లప్పుడు దేవునితో అనుసంధానమై యుండాలి. (one to one relationship) ఆయనతో సన్నిహిత సహవాసము చేయాలి. అప్పుడు ఆయన నీ మాటలు వింటాడు. నీతో మాట్లాడుతాడు. నీ ప్రార్థనలకు జవాబిస్తాడు. మన జీవితమును చూచి ఇతరులు ఆశ్చర్యపడాలి. వీరు కష్టకాలములోకూడ కదలక మెదలక స్థిరముగా ఏలాగు ఉండగలుగుతారు అని ఆశ్చర్యపోవాలి. నేను అనేకులకు ఒక వింతగా నున్నానని దావీదు

భక్తుడు అన్నాడు. యథార్థవంతులకు దేవుడు ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. ఎవనికి యాకోబు దేవుడు సహాయుడగునో దేవుడు తమకు తోడుగా గల జన్యులు ధన్యులు. దేవుడు తోడుగాగల జనులు దేవునికొరకు ఎన్నెన్నో గొప్పకార్యములు చేస్తారు. ఒకసారి ఒక చిన్న కథ చదివాను. ఒక ఏనుగుమీద ఒక చిట్టెలుక కూర్చుని వంతెన దాటుతుంటే ఏనుగు బరువుకు వంతెన కదులుతుంటే చిట్టెలుక అనుకున్నదట – నేను చేయబట్టే వంతెన కదులుతుందని ఏనుగుతో అనగానే ఏనుగు చిట్టెలుకతో నేను లేకుండ ఒంటరిగా వంతెన దాటు, అప్పుడు వంతెన కదులుతందేమో చూడు అని. కొన్నిసార్లు కొందరు మావలన ఇన్ని కార్యములు జరిగాయి, మేము దేవునికొరకు ఇది చేశాము అది చేశామని డంబములు పలుకుతారు. కానీ దేవుడు తోడు లేకుంటే మనము ఏమి చేయలేమని గ్రహించరు. ఈ రోజున మనము ఆయన నామములో ఎన్నెన్నో గొప్పకార్యములు చేస్తున్నామంటే గొప్ప దేవుని తోడు సహాయము మనకు ఉన్నందుకే అని మరచిపోకూడదు.

యథార్థవంతులకు ఆయన ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు ఆయన తోడుగా ఉంటే నీకైమైనా కొదువగా ఉంటుందా? యథార్థవంతులకు ఆయన ఏ మేలును చేయకమానడు. యథార్థవంతులకు ఆయన సూర్యుడు కేడెమునై యున్నాడు. యథార్థవంతులకు చీకటిలోకూడ వెలుగు పుడుతుంది. వారి మార్గములమీద దేవుని వెలుగు ప్రకాశిస్తుంది. దేవునికి స్తోత్రము. హల్లెలూయ. రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు నీకు తోడుగా ఉంటే నీ మార్గము రాజమార్గముగా ఉంటుంది. యథార్థవంతుల వంశపువారు ఆశీర్వదింపబడతారు. కలిమి సంపద వారి యింట నుంటుంది. 112 కీర్తన చదివితే యథార్థవంతులకు ఎన్నో దేవుని వాగ్దానములు వ్రాయబడ్డాయి. ఈ రోజు వాక్యము ధ్యానిస్తున్న మిమ్మును మీరు స్వపరీక్ష చేసికోండి. మీ ప్రవర్తన ఏలాగున్నదో, దేవుడు మీకు తోడుగా ఉన్నాడో లేడోయని మిమ్మును మీరు ప్రశ్నించుకోండి. ప్రభువు నీకు తోడుగా ఉంటే వ్యాధి బాధలైనా, ఇరుకు ఇబ్బందులైనా, కలిమి లేములైనా శత్రుభయమైనా శ్రమలైనా భయములేదు దిగులు లేదు. దేవుడు నీ పక్షమందుంటే నీకు విరోధి ఎవరు? శ్రమలో నీకు తోడైయుండి నిన్ను నీ శ్రమలన్నిటిలో విడిపిస్తాడు. కష్టకాలమందు రక్షకుడైయుండి నిన్ను విమోచిస్తాడు. కాబట్టి నీవు నీతిమంతుడవై యథార్థప్రవర్తన కలిగి దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనమును అసహ్యించుకొని ఎల్లప్పుడు నీతి న్యాయము లనునుసరిస్తూ ఉంటే నిత్యము సదాకాలము యుగసమాప్తివరకు దేవుని తోడు ఆయన సహాయము ఆయన నడిపింపు ఎల్లప్పుడు నీకు ఉంటుంది.

ఈ మధ్యలో ఒక సహోదరి నాతో – అమ్మా, నాకు చాలా భయము వేస్తుంది. ఒంటరిగా ఉండాలంటే భయమనిపిస్తుంది ఎవరైనా తోడుగా ఉంటే బాగుండునని అన్నది. ఆమె మంచి విశ్వాసి, ప్రార్థనాపరురాలు వెంటనే నేను ఆమెతో – దేవుడు ఎల్లప్పుడు నీకు తోడుగా ఉన్నాడు నీవు ఒంటరిదానవు ఏలాగవుతావు. తండ్రి! కుమారుడు పరిశుద్ధాత్మ దేవుడు నీకు తోడుగా ఉంటారు. One + God is great majority దేవునికి భయపడేవారు దేనికి భయపడరని చెప్పి ధైర్యపరచాను. దేవుడు నీ ఒంటరితనములోకూడ నీకు తోడైయుండి నిన్ను సురక్షితముగా కాపాడగలదు అని చెప్పాను. యథార్థవంతులకు దేవుడు ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. దేవుడు తమకు తోడుగాగల జనులు ధన్యులు. దేవునికి స్తోత్రము. ❁

## వన్ డే యూత్ రిట్రీట్ రిపోర్టు

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 15 ఆగష్టు 2023న ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకు "వన్డే యూత్ రిట్రీట్" వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్‌లింగంపల్లి రోడ్, హైదరాబాద్‌నందు ఎంతో జయకరంగా జరిగింది. స్తుతి ఆరాధన, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశంకొరకు ప్రార్థన నాలుగు వర్తమానములు అందించబడినవి. ముఖ్యవర్తమానికులు రెవ. ఎం. డానియేల్ కిషోర్ గారు పాల్గొన్నారు. అంశం : "నీవిక దాసుడవు కావు కుమారుడవే." – గలతీ 4:7 పై వర్తమానము అందించబడింది. యు.పి.ఎఫ్. పాస్టర్ కృపాకర్ గారు "దేవుని వైపు మళ్లుడి" అనే అంశముపై, పాస్టర్ వి. ఇష్మాయేల్ గారు ఇంటర్నెట్ ఆశీర్వాదమా? శాపమా? అనే అచరణాత్మకమైన చర్చ జరిగించారు. యు.పి.ఎఫ్. సీనియర్ పాస్టర్ రెవ.డా. జాయ్ చెరియన్ అమ్మగారు యౌవనస్థులను గూర్చి అనేక సలహాలు, సూచనలు, దిద్దుబాటు, హెచ్చరికలు చేస్తూ హృదయవేదనతో కూడిన మాటలను బోధించారు. యాకోబు పత్రికనుండి జరిగిన క్విజ్‌లో గెలుపొందిన వారికి లైఫ్ అప్లికేషన్ బైబిల్, నగదు బహుమానాలను అందించి యౌవనస్థులందరికీ నూనెరాచి అభిషేక ప్రార్థన చేశారు. ప్రేమవిందు ఏర్పాటు చేయబడింది. సమస్త ఘనత మహిమ దేవునికే చెల్లునుగాక!




 "ఆయన ఆకాశమును మేఘములతో కప్పువాడు భూమికొరకు వర్షము సిద్ధపరచువాడు." - కీర్తనలు 147:8

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 234. "పాపమువలన కలుగు భ్రమచేత మీలో ఎవడును కఠినపరచబడకుండునట్లు - నేడు అనబడు సమయముండగానే, ప్రతిదినమును ఒకనికొకడు బుద్ధి చెప్పకొనుడి." – హెబ్రీ 3:15

"సహోదరులారా, జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్టహృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి. నేడు మీరాయన శబ్దమును వినినయెడల, కోపము పుట్టించినప్పటివలె మీ హృదయములను కఠినపరచుకొనకుడని ఆయన చెప్పెను." – హెబ్రీ. 3:12-15. నేడు అనబడే సమయము ఉండగనే నీవు నీ హృదయాన్ని మెత్తన చేసికోవాలి. నిర్మలమైన మనస్సాక్షిని కాపాడుకోవాలి; హృదయమును కఠినము చేసికొనవద్దు. కొందరి హృదయములు క్రొవ్వుచేత మెరకలైయున్నవని వాక్యము తెలియజేస్తుంది. వారికి దేవుని శబ్దము వినబడదు; వారు దేవుని క్రియలను చూడలేరు. హృదయ కాఠిన్యముచేత దేవుని వాక్యాన్ని హృదయములోకి చేర్చుకోరు. వారు దేవుని క్రియలను గ్రహించలేరు. **"ధర్మశాస్త్రమును, పూర్వికులైన ప్రవక్తలద్వారా సైన్యములకు అధిపతియగు యెహోవా తన ఆత్మ ప్రేరేపణచేత తెలియజేసిన మాటలను, తాము వినకుండునట్లు హృదయములను కురువిందమువలె కఠినపరచుకొనిరి గనుక సైన్యములకు అధిపతియగు యెహోవా యొద్దనుండి మహోగ్రత వారిమీదికి వచ్చెను."** – జెకర్యా 7:12. నీవు నీ హృదయమును కఠినపరచుకొనినప్పుడు దేవుని శిక్ష, దేవుని ఉగ్రత అనుభవించే పరిస్థితి నీకు ఏర్పడుతుంది. ఒకవేళ నీవు నీ తప్పు తెలిసికొని దేవుని కృపకొరకు వేడుకొంటే యేసుక్రీస్తు నిన్ను తన రక్తముతో కడిగి పవిత్రము చేస్తాడు. నీ హృదయము కఠినమైతే నీవు దేవుని మాటలను గ్రహించవు. కావున పాపమువలన కలుగు భ్రమచేత నీవు కఠినపరచబడకూడదు; ఒకవేళ మీ తోటివిశ్వాసి ఆలాగు కఠినపరచ బడుతుంటే నేడు అనబడు సమయంలోనే నీవు వారికి బుద్ధిచెప్పాలి. నీవు ఒకరిని గద్దించినా, సరిదిద్దినా వారియెడల నీవు హృదయపూర్వకముగా ప్రేమకలిగియుండాలి. ప్రేమలేకుండా చేస్తే వారు దేవునికి దూరమయ్యే అవకాశాలుకూడా ఉన్నవి. గనుక నీవు ప్రేమ, సాత్వికము, సహనముతో జారిపోతున్నవారిని పట్టుకోవాలి; పాపములో ఉన్నవారిని కాపాడాలి; శాపగ్రస్తులు కాకుండా వారికి దేవుని వాక్యమును ఎత్తి చూపించాలి.

## 235. "శరీర దురాశలకు లోబడునట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి." – రోమా 6:12

రక్షింపబడిన విశ్వాసిపై శరీర దురాశలకు ఏ పెత్తనము ఉండదు. రక్షింపబడిన విశ్వాసి పరిశుద్ధాత్మ నియంత్రణలో ఉన్నాడు. అంటే దీనర్థం విశ్వాసుల్లో పాపములేదని కాదు; విశ్వాసి పాపాన్ని గెలిచే శక్తి పొందాడని దీని అర్థము. కాబట్టి పౌలు భక్తుడు ఎఫెసీ సంఘముతో **"అయితే ఆత్మపూర్ణులై యుండుడి."** – ఎఫెసీ 5:18 అని చెబుతున్నాడు. ఆత్మపూర్ణులై ఉన్నప్పుడు శరీరకార్యాలన్నీ జయిస్తాము. **"నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరము ఆత్మకును ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును. ఇవి యొకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవిచేయ నిచ్ఛయింతురో వాటిని చేయకుందురు. మీరు ఆత్మచేత నడిపింపబడినయెడల ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు. శరీరకార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. వీటినిగూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను."** – గలతీ 5:16-21

పౌలు భక్తుడు ఆత్మానుసారంగా నడుచుకొంటే మీరు శరీరేచ్ఛను నెరవేర్చరని అనుభవపూర్వకంగా ఖండితముగా చెబుతున్నాడు. క్రీస్తునందు నీకు విజయము కలదు. పరిశుద్ధాత్మపూర్ణునివైన నీకు శరీరకార్యాలమీద తప్పక జయముంది. గనుక నీవు ఆత్మానుసారముగా నడుచుకోవాలి. అప్పుడు నీవు శరీరేచ్ఛను నెరవేర్చకుండా ఉండగలవు. నీవు శరీరేచ్ఛలను జయించాలంటే ఆత్మ శరీరముమీద జయము పొందాలి. ఎందుకంటే ఇవి ఒకదానికొకటి విరుద్ధముగా ఉన్నాయి. ఆత్మ నింపుదల గలవాడు పరిశుద్ధాత్మ నియంత్రణలో ఉంటాడు. పరిశుద్ధాత్ముడు విశ్వాసిపై ఏలుబడి చేస్తాడు. శరీరకార్యాలు చేయువాడు శరీరక్రియలకు లోనౌతున్నాడు. పాపము వానిమీద ప్రభుత్వము చేస్తుంది. గనుక మీరే నిశ్చయించుకోవాలి. నీవు ఎవరి పెత్తనం క్రింద ఉండాలని ఆశిస్తున్నావు? ప్రతి విశ్వాసి ఆత్మనియంత్రణలో ఉండాలనే అనుకుంటాడు. పాపము మనమీద ఏలుబడి చేయడానికి వీలులేదు. దానిని అణచివేయాలి. **"సమాధాన కర్తయగు దేవుడు సాతానును మీ కాళ్లక్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును."** – రోమా 16:20. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబమును నీవు అణగద్రొక్కి ఆత్మతో నింపబడాలి. శరీరకార్యాలు ఆత్మచేత నడిపింపబడాలి. శరీరక్రియలు చేసేవాడు కలహము చేయుటకు ఆత్మతో నింపబడిన వ్యక్తి మీదకు అల్లరితో వచ్చినప్పుడు ఆత్మపూర్ణుడైన వ్యక్తి అల్లరికి బదులు అల్లరి చేయడు. బాధింపబడినను నోరు తెరవకుండా ఉంటాడు. కాని అంతిమ విజయము ఆత్మతో నింపబడిన వ్యక్తిదే. దేవునికి స్తోత్రము! ఆత్మపూర్ణుడు ఆలాగు ఈ జీవితములో ఉన్న పోరాటాన్ని గెలుస్తాడు. **"మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి, అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి, మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి."** – రోమా 6:13

మన శరీరములో ఉన్న ప్రతి అవయవము దేవుని మహిమార్థము ఉపయోగించాలి. అది కన్ను అయినా, చేతులైనా, నీ ఆలోచనలు, క్రియలు అన్నీకూడా నీతికి సాధనములుగా మలచుకోవాలి. నీవు పరిశుద్ధాత్మయొక్క శక్తి పొందాలి. ఇది దుర్నీతి సాధనములుగా ఉండకూడదు. **"మీరు కృపకే గాని ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు గనుక పాపము మీ మీద ప్రభుత్వము చేయదు."** – రోమా 6:14. దేవుని కృప నిన్ను ఆవరిస్తుంది. నీవు ప్రార్థించే వ్యక్తిగా ఉంటే శోధనలోనుండి నిన్ను తప్పించుటకు ప్రభువు సమర్థుడు. అలాగని నీకు ఏ శోధనరాదు, సాతానుకార్యాలు నిన్ను ప్రేరేపింపవు అనికాదు. విశ్వాసి వీటన్నిటిని ఎదుర్కొని వాటిపై జయము పొందుతాడు. ఎందుకంటే విశ్వాసి ప్రార్థిస్తాడు; దేవుని వాక్యమనే ఆత్మఖడ్గము, విశ్వాసమనే డాలు, రక్షణయనే శిరస్త్రాణము, నీతియనే మైమరువు, సత్యమనే దట్టి, సమాధాన సువార్తవలననైన సిద్ధమనస్సు అనే జోడుతో సాతాన్ను అణచివేస్తాడు. అలాగు నీవు నీ జీవితంలో జయం పొందుతావు.

**"అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము. ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము."**

– రోమా 6:22,23

పాపమునకు అంతము శాపము, నిత్యనాశనము, మరణము. పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులగుటవలన మనకు కలిగే ఫలము నిత్యజీవము. **"మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావుగాని, దేవునియెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలముకలవై యున్నవి. మేము వితర్కములను, దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి మీరు సంపూర్ణ విధేయతను కనుపరచినప్పుడు సమస్తమైన అవిధేయతకు ప్రతిదండనచేయ సిద్ధపడి యున్నాము."**

– 2 కొరింథీ 10:4-6

నీవు క్రీస్తుకు విరోధముగా ఉన్న ప్రతివిధమైన ఆలోచన, ప్రతి తలంపు, క్రియను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి దేవునికి సంపూర్ణ విధేయత కనుపరచాలి.

## 236. "అల్లరితోకూడిన ఆటపాటలైనను మత్తయినను లేకయు, కామవిలాసములైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను మత్సరమైనను లేకయు, పగటియందు నడుచుకొన్నట్టు మర్యాదగా నడుచుకొందము."

– రోమా 13:13

విశ్వాసి అమర్యాదగా ప్రవర్తించకూడదు; మర్యాదగా నడుచుకోవాలి. నీవు అల్లరితో కూడిన ఆటపాటలు, మత్తు, కామవిలాసములు, పోకిరి చేష్టలు, కలహము, మత్సరము వంటివన్నీ వదిలివేయాలి. ఇవన్నీ ప్రాచీన స్వభావాలు. నూతన స్వభావము ధరించి క్రీస్తులో నూతనత్వము పొందుచున్న నీవు వీటన్నిటికి దూరముగా ఉండాలి. **"రాత్రి చాల గడచి పగలు సమీపముగా ఉన్నది గనుక మనము అంధకార క్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించుకొందము."** – రోమా 13:12. నీవు వెలుగు మయమైన ఆయుధాలు ధరించి వెలుగుమయమైన కార్యాలు చేయాలి.

విశ్వాసికి అల్లరితోకూడిన ఆటపాటలు తగదు. మరియు మత్తు ఉండకూడదు. దేవుని బిడ్డలు మత్తుపదార్థములు పుచ్చుకోకూడదు. ఇది దేవునికి అయిష్టమైన కార్యము, శరీరకార్యము. మీరు మద్యముతో మత్తులై ఉండకుడిగాని ఆత్మపూర్ణులై ఉండుడి అని భక్తుడు తెలియజేస్తున్నాడు. మరియు మీలో మత్సరము, కలహము ఉండకూడదు. ఆత్మపూర్ణులైన విశ్వాసి జీవితములో కలహము, మత్సరము ఉండకూడదు. వారన్నీ సంతోషంగా ఎదుర్కొంటారు; శ్రమను అనుభవిస్తారు గాని కలహించువారితో తిరిగి కలహించరు. వారి హృదయం పరిశుద్ధాత్మ కాపుదలలో పరిశుద్ధముగా ఉంటుంది. పరిశుద్ధాత్మ దేవుడు వారిని భద్రపరుస్తున్నాడు. వారు ఆత్మపూర్ణులు. ఇవన్నీ చేయడానికి స్వశక్తి సరిపోదు. **"పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు."** – అపో.కా. 1:8. అందుకే ప్రతి విశ్వాసి దేవా, నన్ను నీ ఆత్మతో నింపుమని కోరాలి. నీవు స్వతహాగా ఈ కార్యాలను చేయలేవు. ఒకవేళ నీ హృదయంలో మత్సరము, కోపము, ఈర్ష్య, కలహబుద్ధి ఉంటే దాన్ని తొందరలో తొలగించుకోవాలి. ద్వేషం అనేది నరహత్యకు దారి తీస్తుంది. కావున నీకు ఎవరి మీదను ద్వేషం ఉండకుండా చూసుకోవాలి. సూర్యుడు అస్తమించేవరకు నీ కోపం నిలచి ఉండకూడదు. వెంటనే క్షమించాలి. పాపం మొదట చాలా ఆకర్షణీయంగా ఉంటుంది గాని దాని అవసానం చాలా చేదు. పాపమువలన కలుగు ఫలము ముసిణిపండంత చేదు. కావున నీవు దానిని మొదట్లోనే పెరికివేయాలి. ప్రార్థన, ఉపవాసము, దేవుని సన్నిధివలన ద్రేళ్లతోసహా దానిని పెల్లగించివేయాలి. దేవుడు ఆ శక్తిని నీకు అనుగ్రహిస్తాడు. నీ హృదయంలో అసూయ ఉన్నా దాన్ని వెంటనే తొలగించుకోవాలి. అసూయద్వారా కలహము ఉద్భవిస్తుంది. కాముకత్వము విశ్వాసిని తప్పక వ్యభిచారపాపంలోకి నెట్టివేస్తుంది. గనుక నీవు వీటన్నిటిని జయించాలి. దేవుడిచ్చు సర్వాంగ కవచంలో ఎదుటి వ్యక్తి వేసే ఆయుధాలను అడ్డగించేశక్తి ఉంది. మరియు నీవు ఎదుటి వ్యక్తిమీదికి విసిరే ఆయుధాలుకూడా ఉన్నాయి. రక్షణ అనే శిరస్త్రాణం వేసికొని నీ ఆలోచనలు, మదిలో మెదిలే ప్రతి తలంపును నియంత్రణలో ఉంచుకుంటున్నావు. ప్రార్థన చేసి రక్షణ, విడుదల పొందుతున్నావు. నీతియనే మైమరువు నీ హృదయంలో పాపం రాకుండా కాపాడుతుంది. యేసుక్రీస్తు నీకు నీతిగా ఉన్నాడు. విశ్వాసమనే డాలు పట్టుకొని దుష్టుడు నీమీదికి విసిరే అగ్నిబాణములను ఆర్పి వేస్తున్నావు. సత్యమనే దట్టి కట్టుకొంటున్నావు నీలో అబద్ధములేదు. సత్యమే పలుకుతున్నావు. యేసు సత్యవంతుడు. ఆ ప్రభువుకు దగ్గరగా ఉండి సత్యముతో బ్రతుకుతున్నావు. పాదములకు సమాధాన సువార్త వలననైన సిద్ధమనస్సు అనే జోడు. సువార్తను సంపూర్ణంగా నమ్మి సువార్తకు సంబంధించిన కార్యాలను ఎల్లప్పుడు చేయడానికి సిద్ధమనస్సుతో ఉన్నావు. ఇవన్నీ నిన్ను భద్రపరుస్తున్నాయి. అయితే వాక్యమనే ఆత్మ ఖడ్గము శత్రువును హతమార్చుతుంది. వాక్యముచేత నీవు జయము పొందుతావు. వాక్యము ఎక్కువ తెలిస్తే పాపము చేయలేవు. నా హృదయములో వాక్యము ఉంది గనుక నేను పాపము చేయనని భక్తుడు అంటున్నాడు. దేవుని నిత్యరాజ్యానికి వారసులు కావాలంటే మనము ఇవన్నీ పాటించబద్ధులమై యున్నాము. ❀


"యేసు – చిన్నపిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానియ్యుడి." – మత్తయి 19:14

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**

**1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.)**

**Ph.: 9550504718, 9030757571**

నిర్వహించు

**చిల్డ్రన్స్ రిట్రీట్**

**తేది : 19 సెప్టెంబర్ 2023, మంగళవారము**

**సమయం : ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 3 గం॥ల వరకు**

**స్థలం : యు.పి.ఎఫ్. ఆలయం, రాంనగర్, హైదరాబాదు.**

**అంశం : ఎక్కువైన సంతోషము - 3యోహాను 4**

**వివరములకు : 9550504718,9030757571**

**4 సం॥ల నుండి 16 సం॥ల వయస్సుగల బాలబాలికలకు ఆహ్వానం**

ఆహ్వానించువారు : ప్రభువు దాసురాలు

**జాయ్ చెరియన్**

వ్యవస్థాపక అధ్యక్షురాలు మరియు

సీనియర్ పాస్టర్ – యు.పి.ఎఫ్.

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. భవాని, రాంనగర్:** నేను యు.పి.ఎఫ్. సంఘానికి 2005 సం॥రం నుండి వస్తూ ఇక్కడే రక్షణపొందాను. దేవుడు నా జీవితములో ఎన్నో మేళ్లు చేశాడు. నా కుమార్తె ఇక్కడే ప్రభువులో ఎదిగి కుటుంబముగా స్థిరపడింది. నా కుమారుడు డి. సునీల్ కుమార్ విషయంలో చాలా కన్నీరు కార్చి ప్రార్థించాను. చిన్నప్పటినుండి వాడిని సండేస్కూల్‌కు క్రమంగా తెచ్చేదాన్ని కాని కాలేజికి వచ్చాక వాడు లోకంవైపు ఉండేవాడు. నేను వాడు మారతాడా లేదా అని భయపడ్డాను. నామమాత్రంగా చర్చికి వచ్చి వెళ్లిపోయేవాడు. ప్రార్థన చేసికొందామంటే నేను చేసికొంటానులే మీరు చేసికోండి అనేవాడు. అటువంటిది 2023లో అమ్మగారు బాప్టిస్ట్ చర్చ్, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 40 రోజుల సిలువ ధ్యానాల్లో ఉపవసించి అమ్మగారి దగ్గర పరిచర్యలో ఉండి నా కుమారుడే స్వయంగా సిద్ధపడి ప్రభువును రక్షకునిగా అంగీకరించి బహిరంగంగా సాక్ష్యమిచ్చాడు. నాకు చెప్పలేని సంతోషం కలిగింది. నేను మరల అతడు వెనక్కుపోతాడేమో అనుకొన్నాను గాని దేవుడు అతని వాగ్దానంతో బలపరచాడు. మరియు అమ్మగారు కలలో ఒక బైబిల్ ఇచ్చి ఇది నీకే, దీనిపై నీపేరు వ్రాసికో అని చెప్పారట. 40 రోజుల్లో బలపడి దేవునిలో స్థిరపడుటకు కృపచూపిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**2. కృప శరత్, హైదరాబాద్:** నేను మా మరిది గారికొరకు యు.పి.ఎఫ్. విజ్ఞాపన ప్రార్థనలోనూ, జూమ్ ప్రార్థనలోనూ ప్రార్థన విన్నపము తెలియజేశాను. అతను ఇంట్లోనుండి వెళ్లిపోయాడు. ఎందుకంటే అతని భార్య (మా చెల్లి) పురిట్లో ఉంది. పురిట్లో ఏడిస్తే ఎంతో బాధ మరియు ఆమెకు బి.పి. కూడా ఉంది అని ఆమెకు ఏమీ చెప్పలేదు. హైదరాబాద్‌లో నేను, వైజాగ్‌లో మా అక్క ఎంతో నలిగిపోయాము. ఈ విషయం మా అమ్మకికూడా తెలియనివ్వలేదు. 11.04.2023న అమ్మగారి దగ్గరికి వెళ్లి, మా మరిదికొరకు ప్రార్థన కోరాను. అమ్మగారు ప్రార్థించి – కలవరపడకు, అతను వచ్చేస్తాడు అని చెప్పారు. అమ్మగారి మాట విశ్వసించి ఇంటికి వచ్చేసరికి ఉ॥ 11 గంటలకల్లా నాకు ఫోన్‌ద్వారా అతని గూర్చిన క్షేమ సమాచారము వచ్చేసింది. దేవుడు సంఘ ప్రార్థన విని గొప్పమేలు చేశాడు. మా మరిదిని క్షేమంగా ఇంటికి నడిపించాడు. మరియు నాకు అమ్మగారి ప్రార్థన ద్వారా కుమార్తె జన్మించింది. ఆమెపేరు అద్భుత. ఇప్పుడు 10వ తరగతి చదువుతుంది. కుమారుడు ఎంసెట్ పరీక్ష వ్రాశాడు. దేవుని నామమునకు సమస్త మహిమ కలుగును గాక. ప్రార్థించిన అమ్మగారికి సంఘానికి మా వందనములు.

**3. లూదియ, విద్యానగర్:** మేము చాలా సంవత్సరములనుండి యు.పి.ఎఫ్. సంఘానికి వస్తున్నాము. మాకు ఒక కుమారుడు. ఒక కుమార్తె. మేము దేవునిలో ఎదుగుతూ ఎన్నో మేళ్లు పొందాము. అయితే మా కుమార్తె స్నేహితుల ప్రభావంవలన క్రైస్తవ వివాహానికి ఇష్టపడడం లేదు. మేము ఆమెతో వాదనలేవీ చేయకుండ ప్రార్థనలో పోరాడుదామని ప్రార్థనకు ఉపక్రమించాము. అమ్మగారితో ప్రార్థన చేయించుకొన్నాం. ఆమె వివాహంకొరకు చాలా శ్రమలు అనుభవించాము కాని అమ్మగారి ప్రార్థనవలన దేవుడు కుమార్తెకు అద్భుతముగా, శుభకరముగా క్రైస్తవ పద్ధతిలోనే వివాహం జరిగించాడు. అమ్మగారు వివాహము చీర కొనమని కానుక ఇచ్చి బలపరచి ప్రార్థించి పంపారు. 5.8.2000లో మా కుమార్తె అక్కా వివాహం ఘనంగా జరిగింది. ఆమె యు.పి.ఎఫ్.లో రక్షణ పొందింది. ఆమె మనస్సు మార్చిన దేవునికి స్తోత్రములు.

మరియు 2020 సంవత్సరంలో యు.పి.ఎఫ్. విడిచి ఆంధ్రా వెళ్లాల్సి వచ్చినప్పుడు మేమెంతో దుఃఖించాము. కాని అమ్మగారు ప్రార్థించి మీ కార్యాలన్నీ ముగించుకొన్నాక తిరిగి ఇక్కడికే వస్తారని చెప్పారు. 2023 మే10న తిరిగి వచ్చి మా వ్యాపారంలో కొనసాగుతున్నాము. ఆంధ్రలో ఉన్నప్పుడు నాకు చర్మ సమస్య వచ్చి 6 నెలలు బాధపడ్డాను. దేవుడు అద్భుతముగా స్వస్థపరచాడు. మరియు ఒకరోజు ఆకస్మాత్తుగా నా చెయ్యి, కాలు పనిచేయకుండా కుడిచెంప వంకర పోయి 3 రోజులు అలాగే ఉన్నాను. డాక్టర్ దగ్గరికి వెళ్ళినప్పుడు వెంటనే అడ్మిట్ అవ్వాలి, అది పక్షవాతం అని, బ్రేయిన్‌లో బ్లడ్ క్లాట్స్ ఉన్నాయని హెచ్చరించారు. దేవుని కృపనుబట్టి 3 రోజుల అనంతరం సంపూర్ణ స్వస్థత పొందాను. మేము ఎంతో క్రుంగుదలలో, ఆర్థిక ఇబ్బందుల్లో వచ్చాము కాని ఇక్కడికి వచ్చాక ఎంతో విడుదల పొందాము. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**4. లీలమ్మ, రాంనగర్:** నాకు భయంకరమైన యాక్సిడెంట్ జరిగింది. బ్రతుకుతానన్న ఆశ లేదు. దేవుడు అనేక శ్రమలు బాధలు నొప్పులనుండి సజీవురాలిగా కాపాడాడు. నేను మొదట వాకర్‌తో, తర్వాత కర్ర సహాయంతో నడిచా. ఇప్పుడు నా చిన్న కుమార్తెను పట్టుకొని నడుస్తున్నాను. యాక్సిడెంట్ అయినా నేను పడకపట్టలేదు. దేవుడు కుంటివారికి నడక ఇస్తాడని విశ్వసించి ఆవిధంగా నేను నడిచాను. దేవుడు నన్ను మరణానికి అప్పగించలేదు. మాపట్ల దేవుడు అనేక మేళ్లు చేశాడు. మా పెద్ద కుమార్తెకు ప్రభుత్వోద్యోగము అనుగ్రహించాడు. మా చిన్న కుమార్తెకూడా ఎంతో బలహీనంగా ఉండేది. దేవుడు ఆమెకు మంచి ఆరోగ్యం ఇచ్చి కాపాడుతున్నాడు. దేవునికి స్తోత్రములు.

**5. అనిత, రాంనగర్:** మార్చి 2023లో నేను, నా భర్త, మా ఇద్దరు పిల్లలు మా మామయ్యగారి ఇంటికి ప్రయాణము చేసి తిరిగి వస్తున్నాము. నా భర్త బండి నడపడానికి ప్రయత్నించినప్పుడు అతని కాలు గోరు మొత్తము ఊడిపోయి చాలా రక్తము పోయింది. వెంటనే హాస్పిటల్‌కు తీసికెళ్లినప్పుడు గోరు మొత్తము తీసేయాలని మొత్తం తొలగించారు. నా భర్తకు సుగర్, బి.పి. రెండూ ఉన్నాయి. అందరు – అతనికి సుగర్ ఉంది గనుక గాయం తగ్గడం కష్టమని అన్నారు. అప్పుడు నేను **"యెహోవా రాఫా – యెహోవా స్వస్థపరచువాడు"** అని దేవుని నామము వ్రాశాను. అద్భుతంగా మూడు వారాల్లో గాయం పూర్తిగా మానింది. మరియు మేము మా మరిది కుమార్తె అన్నప్రాసనకొరకు 10.4.23న జనగామ వెళ్లాల్సి ఉంది. ఆ రోజు ఉదయం యు.పి.ఎఫ్. ఆలయానికి వచ్చి ప్రార్థించుకొని వెళ్లాను. దూర ప్రయాణం గనుక పిల్లల్ని తయారు చేస్తున్నప్పుడు బాబు, పాప గొడువపడుతున్నారు. అప్పుడు నేను, నా భర్త ఇద్దరము పాపను కసిరాము ఇక ఏడ్పు ఆరంభించి బయట సోఫాలో పడుకొని అపకుండా చాలాసేపటినుండి ఏడుస్తూ ఉంది. నేను వెళ్లి చూసినప్పుడు అప్పటికీ ఇంకా ఏడుస్తూనే ఉంది. కాళ్లు, చేతులు వంకర్లు పోతున్నాయి. నా భర్తను పిలిచి ఇంట్లో ఉన్న ప్రార్థననూనె కాళ్లు, చేతులు, శరీరానికి పూసి **"స్వస్థపరచు యెహోవా"** అని ప్రార్థించాము. తర్వాత బాగానే జనగామకు వెళ్లాము. దేవుడు తిరుగు ప్రయాణంలో క్షేమంగా మమ్మును తీసికొని వచ్చాడు. ఇంటికి వచ్చాక పాప విపరీతమైన నొప్పులని చెప్పి మోకాళ్లనుండి క్రిందివరకు ముట్టుకొననివ్వడంలేదు. నడవలేక, నిల్చోలేకపోతుంది. నొప్పి నొప్పి అని

ఏడుస్తుంది. మరల ప్రార్థన నూనె రాచి నేను, నా భర్త ప్రార్థించాము. దేవుడు ఆమెను స్వస్థపరచాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**6. శామ్యేల్ సప్పాగు, రాంనగర్:** నా వివాహమై నేటికి (14.4.2023) రెండు సంవత్సరములు. దేవుడు ఈ రెండు సంవత్సములు నన్ను నా భార్యను కాపాడి మెండైన దీవెనలు అనుగ్రహించాడు. నేను సంవత్సరమునుండి ఉద్యోగం చేయడం లేదు. అయినా దేవుడు ప్రతి విషయంలో నాకు తోడుండి నన్ను నడిపిస్తున్నాడు. ఇదివరకు నేను ఉద్యోగం చేస్తూ ఖాళీ సమయాల్లో మ్యూజిక్‌లో శిక్షణ ఇస్తుండేవాన్ని. ప్రస్తుతం నేను మ్యూజిక్ మాత్రమే బోధిస్తున్నాను. దూరప్రాంతాలకు వెళ్లి హోమ్ ట్యూషన్స్ తీసికొంటున్నాను. 15,20 సంవత్సరాలు నావద్ద శిక్షణ పొందుతున్నవారు కూడా ఉన్నారు. అటువంటి విద్యార్థులను నాకు దయచేసి వారితో మంచి బాంధవ్యం ఇచ్చిన దేవుని స్తుతిస్తున్నాను. అమ్మగారు, సంఘము ప్రార్థనలద్వారా దేవుడు అద్భుతముగా నాకు ఒక కుమారుని దయచేశాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**7. భారతమ్మ, గుంటూరు:** నాకు ముగ్గురు అమ్మాయిలు. ఒక అబ్బాయి. 26.01.23న అమ్మగారు యు.పి.ఎఫ్. ఏర్పాటు చేసిన యూత్ రిట్రీట్‌కి రావాలని ఆహ్వానించారు. యౌవనస్థులందరికి అభిషేక ప్రార్థన చేస్తారని తెలియజేశారు. చీరాల, విజయవాడ, గుంటూరులో ఉండే కొంతమందిమి కలిసి ఉ॥ 9 గంటలకల్లా వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్‌లింగంపల్లి రోడ్, హైదరాబాద్‌కు చేరుకొన్నాము. అమ్మగారు – మా పిల్లలు శ్రావణి, సంధ్య, ఎలీఫజ్‌లకు నూనె రాసి ప్రార్థించారు. అబ్బాయి బి.డి.ఎస్. పూర్తి చేశాక డ్యూటీ డాక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. అతనికి రావాల్సిన రూ॥ 20,000/– చెల్లింపుకూడా ప్రభువు కృపనుబట్టి తిరిగి అకౌంట్‌లో జమచేయబడ్డాయి. మరియు మా పెద్ద కుమార్తె చీరాలలో సెక్రటరియేట్‌లో ఉద్యోగం చేస్తుండగా కొన్ని విషయాల్లో ఎంతో రాజకీయ ఒత్తిడికి గురైంది. అమ్మగారితో ప్రార్థన చేయించుకొని వెళ్లాక విడుదల లభించింది; ఆమెపై ఉన్న ఆరోపణలన్నీ తొలగిపోయినవి. మరియు చిన్నమ్మాయి శ్రావణికి మేము అనుకున్న ఉద్యోగము వస్తుందని నమ్మికలేదు కాని అమ్మగారితో అభిషేక ప్రార్థన చేయించుకొని వెళ్లాక ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత పొందింది. ఇవియే గాక యు.పి.ఎఫ్. జూమ్ ప్రార్థనల్లో ప్రార్థన విన్నపము తెలియజేయుటద్వారా అనేక మేలులు పొందాము. దేవుని నామమునకు స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**8. అమ్మాజి, విజయవాడ:** 2022లో అమ్మగారు నాకొరకు ప్రార్థించి ఒక వాగ్దానము ఇచ్చినప్పుడు నా వివాహము గొప్పగా జరిగింది. అమ్మగారు గర్భఫలము లేనివారు **"విశ్వాసమునుబట్టి శారాయు వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడని యెంచుకొనెను గనుక తాను వయస్సు గతించినదైనను గర్భము ధరించుటకు శక్తిపొందెను."** – హెబ్రీ 11:11 వాగ్దానము వ్రాయుమని చెప్పారు. నేను అప్పటినుంటి వ్రాస్తున్నాను. ఆవిధంగా దేవుడు నాకు గర్భము తెరిచాడు. నేను గర్భఫలంకొరకు యు.పి.ఎఫ్.లో మ॥ 2 గంటలనుండి సా॥ 4 గంటలవరకు జరిగే జూమ్ ప్రార్థనలో ప్రతి దినము పాల్గొంటున్నాను. అప్పుడు నా కోసం ప్రార్థించినప్పుడు దేవుడు నా గర్భము తెరిచాడు. అయితే 4వ నెలలో 12.04.2023న నాకు స్కానింగ్ తీసినప్పుడు బేబి ఎదుగుదల సరిగా లేదని బేబి మెడ వెనుక ఉన్న నీటి కొలత 2.5 ఉండాలి కాని 3 ఉంది. నాసిల్ బోన్ కనిపించడం లేదు; రక్తపరీక్ష చేయాలి. దానికి 12 వేలు ఖర్చు అవుతుంది అని చెప్పారు. నేను 18.4.23న జూమ్‌లో నా ప్రార్థన విన్నపము తెలియజేసినప్పుడు అమ్మగారు సంఘము నాకొరకు ప్రార్థించారు. నేను రక్తపరీక్షకు నమూనా ఇచ్చాను. దేవుని కృపనుబట్టి ఇప్పుడు నాకు ఎనిమిది నెలలు, డాక్టర్స్ చెప్పిన సమస్యలు ఏవీలేవు. బేబి అంతా బాగుందని చెప్పారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**9. స్వర్ణలత, తిలక్ నగర్:** నేను యు.పి.ఎఫ్. సంఘానికి క్రమంగా వస్తూ దేవునియొద్దనుండి అనేక మేలులు పొందాను. ప్రభువు కృపనుబట్టి నా కుమార్తె బ్రిజిత ఎం.ఫార్మసీ పూర్తయింది. మొదటి సంవత్సరం 89 శాతం, రెండవ సంవత్సరం 91 శాతం మార్కులు వచ్చినవి. దేవుడు ఆమెకు మంచి ఉద్యోగముకూడా అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**10. శాంతి, హైదరాబాద్:** నేను నా చిన్నతనంనుండి యు.పి.ఎఫ్.కి వస్తున్నాను. అయితే నా వివాహమయ్యాక జూమ్‌ద్వారా యు.పి.ఎఫ్. సంఘానికి అంటుకట్టబడి దేవునిలో ఇంకా ఎక్కువగా బలపడి సమీపముగా అయ్యాను. నా జీవితంలో ఏ సమస్య వచ్చినా నాకేమీ భయములేదు, దేవుడు నాకు తోడుగా ఉన్నాడనే విశ్వాసం నాకు రోజురోజుకు పెరుగుతూ ఉంది. అయితే ఈ మధ్యకాలంలో వీపులో మెరుపులాగా నొప్పి వచ్చింది. అప్పుడు నేనేమీ భయపడలేదు. **దహించు అగ్ని** అనే దేవుని నామము వ్రాసి ప్రార్థించుకొనుచుండగా, జూమ్‌లో వాక్యం వింటుండగా నాకు తెలియకుండానే ఆ నొప్పి తగ్గిపోయింది. మా కుమారుడు హాస్టల్‌లో ఉంటూ ఎం.బి.బి.ఎస్. చదువుతున్నాడు. అతనికి అకస్మాత్తుగా తలనొప్పి వచ్చి భరించలేకుండా ఇంటికి వచ్చేస్తానన్నప్పుడు –మోకరించి దేవుని తట్టు చేతులెత్తి ఒక్కసారి ప్రార్థించుకోమని చెప్పాను. నేను దహించు అగ్ని అనే నామము వ్రాశాను. అమ్మగారు **"దహించు అగ్ని"** అనే దేవుని నామమును మనకు పరిచయము చేశారు. ఆ నామము వ్రాసి అనేక ఆశీర్వాదములు అనుభవపూర్వకంగా పొంది అనేకులకు తెలియజేశాను. ఏ మందులు, ఏ డాక్టరు అవసరము లేకుండా దేవుడు మా కుమారునికి అద్భుత స్వస్థతనిచ్చాడు. అతని తలనొప్పి పూర్తిగా తగ్గిపోయింది. మా కుటుంబ సభ్యులు ఎవరు ఎక్కడ ఉన్నా, ఎవరికి ఏ సమస్య వచ్చినా **"దహించు అగ్ని"** అనే నామము వ్రాసి దేవుని వైపు తిరిగి ప్రార్థిస్తే అన్నీ పోతాయనే విశ్వాసము నాలో బలపడింది. అందుకు అమ్మగారికి వందనములు. దేవునికి మహిమ కలుగును గాక.

**11. పరమేశ్వరి, జూబ్లిహిల్స్ :** 20.04.22 నుండి మా బాబు (అద్విత్) కు జలుబు, దగ్గు, విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పి అన్నీ వచ్చినవి. వేకువజాము 3 గంటలనుండి ఎక్కువ వాంతులు చేశాడు. నాకు చాలా భయము కలిగి అప్పటినుండి ప్రార్థిస్తూనే ఉన్నాను. యు.పి.ఎఫ్. 24×7 నిరంతర జూమ్ ప్రార్థనలో ప్రార్థన విన్నపము తెలియజేశాను. అందరు మా బాబు కోసం ఎంతో ప్రార్థించారు. 22.07.22న బాబుకు అద్భుతస్వస్థత లభించింది. వచ్చిన బలహీనత, జ్వరంవలన కొంత నీరసించాడు కాని అస్వస్థత అంతా తొలగిపోయింది. నేను జీవపుమాటలు, దైవిక స్వస్థత పుస్తకముల్లో వాగ్దానాలన్నీ చదివి పిల్లల ఆశీర్వాదాలు ఎత్తిపట్టి బాబు తలపై చెయ్యి పెట్టి ప్రార్థిస్తూ వచ్చాను. మామూలుగా ఇలాంటి అస్వస్థత కలిగితే అది తగ్గడానికి రెండు, మూడు వారాల సమయం పడుతుంది. కాని ప్రార్థిస్తూ ఉన్నప్పుడు రెండు రోజుల్లో అద్భుతంగా స్వస్థత లభించింది. నా దగ్గర పరిశుద్ధ గ్రంథము ఉంది, నేను ప్రార్థిస్తాను. కాని ఈలాగు వాగ్దానాలు ఎత్తిపట్టి ప్రార్థిస్తే దేవుడు వింటాడని ఈ మార్గము, ప్రార్థన విధానము నేర్పించిన అమ్మగారికి వందనములు. దేవునికి స్తోత్రములు.

# యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక రచనలు

జాయ్ చెరియన్ గారు రచించిన పుస్తకములు మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును. పోస్టుద్వారా కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

1) **"దేవుని వెయ్యి నామములు" - Vol - I to X** వెల రూ. 150/-
1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) **(each one)**

2) **"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I** వెల రూ. 150/-
1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)

3) **"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I to III** వెల రూ. 150/-
1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) **(each one)**

4) **"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) వెల రూ. 150/-

5) **"అద్భుత కార్యములు" - Vol - I to IV** వెల రూ. 150/- **(each one)**

6) **"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) వెల రూ. 150/-

7) **"జీవపు మాటలు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) వెల రూ. 20/-

8) **"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) వెల రూ. 20/-

9) **"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) వెల రూ.20/-

10) **"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) వెల రూ. 20/-

11) **"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) వెల రూ. 20/-

12) **"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) వెల రూ. 20/-

13) **"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) వెల రూ. 20/-

14) **"తల్లి ఒప్పకోలు" పుస్తకము** (తెలుగు) వెల రూ. 20/-

15) **"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) వెల రూ. 20/-

16) **"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) వెల రూ. 20/-

17) **"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) వెల రూ. 10/-

18) **"మందిరముకొరకు వాగ్దానములు"** (ఇంగ్లీషు మరియు తెలుగు) వెల రూ. 10/-

19) **"మనము దేనికొరకు ప్రార్థించాలి"** (ఇంగ్లీషు మరియు తెలుగు) వెల రూ. 10/-

20) **"నూతన సంవత్సర క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లీషు) వెల రూ. 60/-

## విశ్వాసులకు విజ్ఞప్తి



**క్రీస్తునందు ప్రియ విశ్వాసులారా,**

నేను ఒక ముఖ్యమైన కార్యము మీతో పంచుకోవాలని ప్రేరణ కలిగియున్నాను. ప్రార్థనకూడా చేయాలని మిమ్మును కోరుతున్నాను. ఎందుకంటే ప్రార్థన అద్భుతాలు చేస్తుంది. ప్రార్థించినప్పుడే మనము ప్రభువుకొరకు గొప్పకార్యాలు చేయగలము. మనము మానవులము కాని దేవుడు తన ఆత్మతో మనలను నింపి దేవునికొరకు ఘనమైన కార్యాలు చేయడానికి వాడుకొంటాడు. **"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు."** – దానియేలు 11:32

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్.) 28 సంవత్సరముల నుండి ప్రజలకు సేవలు అందిస్తుంది. యు.పి.ఎఫ్.కు ఒక సొంత మందిరమంటూ లేదు. ఇంతవరకు ఆరాధన మందిరం కట్టబడలేదు కాని మా తండ్రి పాస్టర్ ఎ.ఎన్. మాథ్యూగారు నిర్మించిన ఆలయంలో ఆరాధన జరుగుతూ వచ్చింది. పట్టజాలనంత జనాలు వచ్చినప్పుడు ఫంక్షన్ హాల్స్‌లో ఆరాధనలు జరిపించాము. కాని ఇప్పుడు సమయం వచ్చింది. తప్పకుండా యు.పి.ఎఫ్.కు ఒక ఆలయం నిర్మించాలని ప్రభువు నన్ను ప్రేరేపించాడు. సరియైన స్థలం కొనాలి; మందిరం నిర్మాణం చేయాలి; దేవుడు సహాయకులను మంచి ఆలోచనకర్తలను అనుగ్రహించాలి. పెద్దలందరు కూడి ఈ కార్యాన్ని చేయాలని ప్రార్థిస్తున్నాను.

ఇటీవల యునైడెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ట్రస్ట్ బిల్డింగ్ ఫండ్ అని ఒక అకౌంట్ ఏర్పాటు చేశాము. ఎవరినీ బలవంతము చేయడం లేదు. ఇది దైవకార్యము. మీకు ప్రేరణ కలిగిన కొలది దైవకార్యానికి పవిత్రమైన, సంపూర్ణమైన హృదయంతో ఇవ్వాలి. ఎవరి ఒత్తిడిచేతగాని, బలవంతముచేత గాని మనము ఇవ్వకూడదు. కాబట్టి నేను దేవునికి ప్రార్థన చేస్తున్నాను; మీకు తెలియజేస్తున్నాను. దేవుడు మిమ్మును ప్రేరేపించి కార్యము చేయాలి. దేవుడు మిమ్మును ప్రేరేపించిన కొలది ఈ అకౌంట్‌లో మీరు మీ విలువైన విరాళాలు పంపిస్తే ప్రతిపైసా భద్రంగా పొందుపర్చి తప్పకుండా మందిరనిర్మాణానికి వినియోగిస్తామని తెలియజేస్తున్నాను. ఒకవేళ మీరు ఇతర యు.పి.ఎఫ్. బ్యాంక్ ఖాతాల్లోకి పంపినా అది యు.పి.ఎఫ్. బిల్డింగ్ ఫండ్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా మీరు ఈ కార్యంకొరకు ప్రార్థన చేయాలి. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్‌ద్వారా ఆశీర్వదింపబడినవారు కోకొల్లలుగా ఉన్నారు. మనము ఎక్కువగా ప్రకటనలు చేసి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోలేదు. దేవుడు మన ప్రయత్నాలు చూస్తున్నాడనే విశ్వాసం నాకు ఉన్నది. 31 సంవత్సరాలు మీరు యు.పి.ఎఫ్. ద్వారా ఆశీర్వదింపబడ్డారు. కావున మీరు తప్పకుండా యు.పి.ఎఫ్. యెడల కృతజ్ఞులైయుండాలి. దీవింపబడినవారికి నేను తెలియజేస్తున్నాను. మీకు తప్పకుండా యు.పి.ఎఫ్. పట్ల ఒక కర్తవ్యం ఉంది. తప్పకుండా మీరు మీ శాయశక్తుల సహాయపడాలి. నేను ప్రభువు ప్రేరణతో మీకు ఈ విషయం తెలియజేస్తున్నాను. ప్రభువు–**"నన్ను ప్రేమించువారిని ఆస్తికర్తలుగా చేయుదును వారి నిధులను నింపుదును."** – సామెతలు 8:21 అనే వాగ్దానమును నాకు గుర్తు చేశాడు. మనము ప్రభువును ప్రేమిస్తున్నాము; సేవిస్తున్నాము; ఆయన మాటకు విధేయులౌతున్నాము కావున తప్పకుండా ఈ కార్యం జరుగుతుందని నేను విశ్వసిస్తున్నాను. మీరుకూడా దేవుడు నా దర్శనం నెరవేర్చునట్లు ప్రార్థించాలని కోరుతున్నాను. దేవునికి సమస్తం సాధ్యమని నేను హృదయపూర్వకముగా నమ్ముచున్నాను. దేవుడు మిమ్ముల నందరినీ ఆశీర్వదించును గాక!

**United Peoples Fellowship Trust Building Fund Account**

Bank and Account Details

**Account Name : United People's Fellowship Trust Building Fund**

**A/c No. : 63050106213O  Bank : ICICI - Himayat Nagar Branch  IFSC Code : ICIC0006305**

RNI. No. APTEL 2007/24270



# యు.పి.ఎఫ్. కార్యక్రమాలు

1. **ఆదివారము ప్రభాత తెలుగు ఆరాధన :**
ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు

**సాయంకాల తెలుగు ఆరాధన :**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.

యు.పి.ఎఫ్. ఆలయంలో ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు **డిజిటల్ సర్వీస్** జరుగును.

**ఇంగ్లీషు మరియు హిందీ ఆరాధన :**
సా॥ 4.00 గం॥ల నుండి 6.00 గం॥ల వరకు
**జూమ్‌లో మాత్రమే జరుగును.**

**సండే స్కూల్ :** ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.

2. సోమవారము:
**తల్లుల సహవాసము, మెన్స్ ఫెలోషిప్, మండే స్కూల్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు

3. మంగళవారము : **యంగ్ ఉమెన్స్ ఫెలోషిప్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు

4. బుధవారము : **తేనెధారలు కార్యక్రమము**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు

5. గురువారము : **వాలంటీర్స్ మీటింగ్**
సా॥ 7.00 గం॥ల నుండి రా॥ 8.30 ని॥ల వరకు

6. శుక్రవారము :
**ప్రభాత ఆరాధన** - ఉ॥ 5.00 గం॥లకు
**గ్రాండ్ పేరెంట్స్ మీటింగ్** - ఉ॥ 10.00 గం॥లకు
**శుక్రవారము ఉపవాస ప్రార్థన** - సా॥ 6.00 గం॥లకు

7. శనివారము :
**యౌవనస్థుల కూడిక & మెన్స్ ఫెలోషిప్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
స్థలం : యు.పి.ఎఫ్. ఆలయం, రాంనగర్‌లో జరుగును.

**24/7 నిరంతర ప్రార్థనలు**
రాత్రింబవళ్ళు, నిరంతరము జూమ్‌ద్వారా ప్రార్థనలు జరుగును

ప్రతి నెల చివరి బుధవారము **సంపూర్ణ రాత్రి ప్రార్థన**
సమయం : రా॥ 9.00 గం॥ల నుడిం ఉ॥ 5.00 గం॥ల వరకు
స్థలం : సెంటినరి బాప్టిస్టు చర్చి, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.

ప్రతి నెల మొదటి ఆదివారము **కుటుంబ ఆదివారము**
సమయం: ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

ప్రతి నెల చివరి ఆదివారము **కృతజ్ఞత స్తుతి ఆరాధన**
సమయం : ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

ప్రతి సం॥ జనవరి 26వ తేది **ఫ్యామిలీ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్.

ప్రతి సం॥ ఆగష్టు 15వ తేది: **వన్‌డే యూత్ రిట్రీట్** మరియు
ప్రతి సం॥ అక్టోబర్ 02వ తేది **ఉమెన్స్ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్‌లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

## జీవపు మాటలు టి.వి. కార్యక్రమాలు

1. **ఆరాధన ఛానల్ :** ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు
2. **శుభవార్త ఛానల్ :** సోమవారము నుండి శుక్రవారము వరకు ఉ॥ 8.00 గం॥లకు, ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు ప్రతి శనివారము మ॥ 12.00 గం॥లకు
3. **కల్వరి ఛానల్ :** ప్రతి రోజు ఉ॥ 9 గం॥లకు & 10.30ని॥లకు

**జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.**

| ప్రతి నెల మొదటి గురువారం<br>**24 గంటలు స్తుతి ఆరాధన**<br>ఉ॥ 6.00 గం॥ల నుండి మరుసటి రోజు<br>ఉ॥ 6.00 గం॥ల వరకు | ప్రతి నెల రెండవ శనివారము<br>**ప్రత్యేక ఉపవాస ప్రార్థన**<br>సమయం: ఉ॥ 9 గం॥ల నుండి<br>సా॥ 5.00 గం॥ల వరకు |
|---|---|
| స్థలం : రాంనగర్, యు.పి.ఎఫ్. ఆలయంలో | |

సేవలో పాలుపొందండి
7901236907

యు.పి.ఎఫ్. పరిచర్య కొరకు ప్రార్థించగలరు:
Zoom Meeting ID: 9550504718 Code :7777
E-mail id: joycherian@hotmail.com
www.upf.org.in
Youtube / Joy Cherian - Upf
Facebook / Joy Cherian - Upf
Instagram / Joy Cherian - UPF
9550504718

Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,
# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,
Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 9550504718, 9030757571
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862